ప్రభాత
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 14
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
బుధవారం, 26-07-2023

విలేకర్లు కావలెను
జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me



# మళ్లీ ట్రాక్ లోకి బీజేపీ

**హైదరాబాద్, జూలై 25, (న్యూస్ పల్స్)**

మొన్నటి వరకు కాస్త నెమ్మదించిన కాషాయదళం ఇపుడు స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని చాటే యత్నాలను ముమ్మరం చేసింది. అందుకు పార్లమెంటులో ఆ రెండు పార్టీలు దాదాపు కలిసి పని చేస్తున్నట్లుగా సాక్ష్యాలను చూపుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దాకానే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రత్యర్థులుగా నటిస్తాయని, ఆ తర్వాత కన్వీనియెంట్‌గా కలిసి పోతాయని కమల నాథులు చెబుతున్నారు. దానికి తోడు ఆపరేషన్ ఆకర్ష్‌ని వేగవంతం చేసేందుకు కూడా బీజేపీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు. దీనికి అనుగుణంగా శ్రావణ మాసంలో బీజేపీలోకి చేరికలుంటాయని, ఏకంగా 15 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారని ప్రచారం చేసుకుంటున్నారు. ఈప్రచారంలో వాస్తవమెంతుందో కానీ.. బీజేపీ ఎన్నికల కసరత్తు వేగవంతమైందని మాత్రం చెప్పవచ్చు. ఎన్నికలకు రెడీ అవుతున్న బీజేపీ ఓవైపు ప్రజలను ప్రభావితం చేసే కార్యాచరణను అమలు చేస్తూనే ఇంకోవైపు అభ్యర్థుల ఎంపికపై సమాలోచనలు ప్రారంభించిందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే గెలుపు గుర్రాల జాబితాను బీజేపీ యంత్రాంగం రెడీ చేస్తోన్నట్లు తెలుస్తోంది. మెజారిటీ నియోజకవర్గాలలో ముందుగానే టికెట్లు ప్రకటిస్తే బెటరని బీజేపీ రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు రెండో వారంలో 119 నియోజకవర్గాలకు ఎమ్మెల్యేల ప్రకటించాలని బీజేపీ యోచిస్తుందని, ఈ అభ్యర్థులంతా వారం పాటు నియోజక వర్గాల్లో మకాం వేయించేలా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో దాదాపు అన్ని పార్టీలు అలర్టవుతున్నాయి. ప్రధానంగా టీ.బీజేపీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలని వ్యూహ రచన చేస్తున్నట్లు పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. దీనిపై పార్టీలో పెద్ద కసరత్తే జరుగుతోందని వారంటున్నారు. టికెట్లు ఆశించే నాయకులు కూడా ముందుగానే తమ పేర్లను ప్రకటించాలని కోరుతున్నారు. ముందుగానే టికెట్లు కేటాయిస్తే బెటర్ అని ఆశావాహులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే అధిష్టానం నియోజకవర్గా ల వారీగా అభ్యర్థుల జాబితాను రెడీ చేస్తోందని సమాచారం. అతి త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించనుంది బీజేపీ హైకమాండ్. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం క్రియేట్ చేస్తోంది. మిగతా రాజకీయ పార్టీల కంటే ముందుగానే రెడీ అవుతోంది. ఎప్పటి నుంచో బీజేపీ జాతీయ నాయకులు, కేంద్రమంత్రులు తెలంగాణకు రెగ్యులర్‌గా వస్తున్నారు. ఓవైపు ఎన్నికల హడావుడిని క్రియేట్ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందనే సంకేతాలను పంపిస్తున్నారు. అయితే.. ఈ మధ్య రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో పాటు.. పార్టీలో నెలకొన్న అనిశ్చితి.. నాయకుల మధ్య విబేధాలు కొంత పార్టీని ఇబ్బంది పెట్టాయి. అంతేకాదు.. పార్టీ క్యాడర్ లో జోష్ ను తగ్గించింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీ హైకమాండ్ తెలంగాణపై సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. 119 నియోజకవర్గాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా షాడో టీమ్ ఇదివరకే పర్యటించినట్లు తెలుస్తోంది. దాదాపు మూడు సార్లు సర్వేలు చేయించారని చెబుతున్నారు. ఆ రిపోర్టులు కూడా బీజేపీ అధిష్టానం వద్దకు ఆల్ రెడీ చేరిపోయాయని తెలుస్తోంది. తెలంగాణ సామాన్య ప్రజానీకం బీజేపీ గురించి ఏమనుకుంటున్నారు? ఓటరు నాడి ఎలా ఉంది? రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు? కేంద్ర అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు

# చిత్తడి చిత్తడిగా మహానగరం

**నగరమా! నడిసంద్రమా! రెండు గంటల్లో హైదరాబాద్ సముద్రంలా మారింది. హఠాత్తుగా దంచి కొట్టిన వానతో భాగ్యనగరం చివురుటాకులా వణికిపోయింది. ఓవైపు ఎల్లో అలర్ట్ కొనసాగుతుండగా... నగరం నలుమూలలా రెండు గంటల పాటు కుంభవృష్టి కురిసింది. దీంతో ఇటు కూకట్‌పల్లి నుంచి అటు ఉప్పల్ వరకు వర్షం బీభత్సం సృష్టించింది. ఇక రేపటి నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షా ల హెచ్చరిక జారీచేసింది వాతావరణ శాఖ. రెండే రెండు గంటల్లో భాగ్యనగర వీధులు మహాసంద్రాన్ని తలపించాయి. ఉరుములు మెరుపులతో రెండు గంటలపాటు కురిసిన కుంభవృష్టికి హైదరాబాద్ అతలాకుతలం అయ్యింది. రోడ్లు జలాశయాల్లా మారాయి. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న సెక్రటేరియట్ ప్రాంతంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి.ఒకే ఒక్క గంటలో ఐదు సెంటీమీటర్ల జడివాన కురిసింది. కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఎటు చూస్తే అటు నీళ్ళు.. అడుగు తీసి అడుగువేయాలంటే హడలిపోయారు జనం. ఎక్కడ ఏ మ్యాన్ హోల్ ఉంటుందోనని గజగజ వణికి పోయారు.**



2 లో

# మంత్రి శ్రీనివాస గౌడ్ కు షాక్

**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కూ హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన వేసిన పిటిషన్ ను కొట్టేసింది. ఆయన ఎన్నిక అక్రమమంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు అనుమతించింది. తన ఎన్నికల చెల్లదంటూ దాఖలైన పిటిషన్ నుకొట్టి వేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికల అఫిడవిట్ లో తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించారని శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే, మంత్రి గా కొనసాగే అర్హత లేదని పిటిషన్ దాఖలయింది. మహబూబ్ నగర్ ఓటర్ రాఘవేంద్ర రాజు ఈ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా శ్రీనివాస్ గౌడ్ వేసిన పిటిషన్ కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. రాఘవేంద్ర రాజు వేసిన పిటిషన్ ను అనుమతించింది హైకోర్టు. అఫిడవిట్‌లో తప్పులు ఉన్న కారణంగా కొత్తగూడెం ఎమ్మెల్యేపై అనర్హతా వేటు వేసిన రోజే.. శ్రీనివాస్ గౌడ్ వ్యవహారంలోనూ హైకోర్టు ఆయన అఫిడవిట్ వ్యవహారంలో విచారణకు అంగీకరించడం కలకలం రేపుతోంది. 2018 ముందస్తు ఎన్నికల సమయంలో మహబూబ్ నగర్ నుంచి పోటీ చేసిన శ్రీనివాస్ గౌడ్ ఆ సమయంలో నామినేషన్ తో పాటు, అఫిడవిట్ దాఖలు చేశారు.దానిని ఎన్నికల సంఘం వెబ్ సైట్ లోనూ పొందుపరిచారు. రంగంలోకి దిగిన కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరుపుతోంది. ఈ మధ్యలో ఈ అంశంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్లి రాఘవేంద్ర రాజును తెలంగాణ పోలీసులు మంత్రి శ్రీనివాస్ గౌడ్ హత్యకు కుట్ర చేశారని ఆరోపిస్తూ అరెస్ట్ చేశారు. వారిపై సంచలన ఆరోపణలు చేశారు. పదిహేను కోట్లసుపారీతో మంత్రిని హత్య చేయాలనుకున్నారని తేల్చారు. అయితే ఎలాంటి సాక్ష్యాలను చూపించలేకపోయారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. మంత్రి ఎన్నికపై పోరాడుతున్నందునే తనపై తప్పుడు కేసులు పెట్టారని రాఘవేందర్ రాజు ఆరోపిస్తున్నారు. మొత్తంగా.. మంత్రి శ్రీనివాస్ గౌడ్ అఫిడవిట్ మార్పు వ్యవహారం.. సంచలనంగా మారే అవకాశాలు ఉన్నాయి.



# వారానికి 3 రోజులు రండి

5 లో



# ఆపరేషన్ ఆకర్ష్ కు గులాబీ వల

2 లో

# సెల్ఫీతో కాంగ్రెస్ కార్యక్రమాలు

**జయభేరి, హైదరాబాద్ :**



సీఎం కెసిఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ప్రతి సందర్భంలో పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. భట్టీ మాట్లాడుతూ తెలంగాణ సమాజన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. 50 సంవత్సరాల్లో మేము చేసిన అభివృద్ధి ముందు సెల్ఫీ తో బయటపెడతాం. వాటికీ సంబధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. ఉచిత విద్యుత్ మేమే ఇచ్చామని చెబుతున్నారు. 2004 లో ఉచిత విద్యుత్ పైన ముఖ్యమంత్రి గా వైస్సార్ మొదటి సంతకం చేశారు. దానినే సెల్ఫీ ఫొటో తో ఇప్పుడు బయటపడుతున్నాం. ఈ కార్యక్రమాన్ని ప్రచారక కమిటీ చైర్మన్ మధు యాష్కి తోకలిసి సెల్ఫీ తో చూపిస్తున్నాం. 1999 కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉచిత విద్యుత్ హామీ ఇచ్చాం. ఆ నాటి మేనిఫెస్టోని ఇప్పుడు చూపిస్తున్నాం. రైతులకు ఉచిత విద్యుత్, బకాయిలా మాఫీ, కొత్త దరఖాస్తూ లో 30 రోజుల్లోపే పరిశీలన, వ్యవసాయం లో ఆధునిక పద్ధతులు, పండించిన పంటకు గిట్టుబాటు ని మేనిఫెస్టోలో కల్పించామని అన్నారు. 1999 లో అధికారంలోకి రాకపోవడం తో 2004 లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంతకం పెట్టి ఉచిత విద్యుత్ ని అమలు చేసిందే కాంగ్రెస్ పార్టీ నే. ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్ దే. ఆనాడు కాంగ్రెస్ పార్టీ చెపట్టిన అన్ని కార్యక్రమాలపై సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్మెంట్ తో ప్రజల ముందు ఉంచుతాం. ప్రతి ఒక్కరూ ఈ ఫొటో ను చూపెట్టి గుర్తు చేయాలి. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో మేనిఫెస్టో ఉంటుంది. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఆదాయాన్ని బట్టి ఇష్యూస్ ఉంటాయి. మేము 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందిస్తాం. పిసిసి మాటలు వక్రీకరించారు. మెట్రో రైలు మేమే తెచ్చాం.. మెట్రో ఎక్కి సెల్ఫీ తీస్తాం. మెట్రో డీటెయిల్స్ పెడతాం. ప్రతి ప్రాజెక్టు లు, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్, డ్రింకింగ్ వాటర్ ఇలా ప్రతి కార్యక్రమంలో సెల్ఫీ విత్ కాంగ్రెస్ తో ముందుకు వెళతామని అన్నారు.

# సింగిల్ కార్డులో ప్రజా రవాణా



4 లో

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని

# సీఎంకు పోస్ట్ కార్డు సందేశం



3 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## మళ్లీ ట్రాక్ లోకి బీజేపీ

అందుతున్నాయా.. లేదా? ప్రభుత్వ తీరుపై ప్రజల ఓపీనియన్ కు సంబంధించిన సర్వే రిపోర్టులు బీజేపీ అధిష్టానం వద్దకు చేరాయి. ఈ రిపోర్టు ఆధారంగా కూడా అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందంటున్నారు. సంస్థాగతంగా చేయాల్సిన పనులు చాలా వున్నాయన్న రీజన్ వల్లే జులై 29న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. అమిత్ షా సభను ఏర్పాటు చేసి ఖమ్మంలో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ముందుగా తలపెట్టింది. కానీ తాజాగా ఖమ్మం సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఖమ్మంకు బదులుగా అమిత్ షా హైదరాబాద్ వస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ వేదికగా బీజేపీ సంస్థాగత అంశాలపై అమిత్ షా సమీక్ష జరుపుతారని, పార్టీ వివిధ విభాగాలలో భేటీ అవుతారని తెలుస్తోంది. ఎన్నికల సన్నాహాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, దానికి అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని దారిలో పెట్టాలని అమిత్ షా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అమిత్ షా పర్యటను ఖరారు చేయడంతోపాటు ఆయన వివిధ మోర్చాలతో భేటీ అయ్యే షెడ్యూలుని ఖరారు చేసేందుకు జులై 26న రాష్ట్ర కీలక నేతలు భేటీ కానున్నారు.ఆగష్టు రెండోవారంలో బీజేపీ జాతీయ నేతలు, కేంద్రమంత్రులు తెలంగాణకు పెద్ద ఎత్తున వస్తున్నట్లు తెలుస్తోంది. వారంతా వారం రోజుల పాటు నియోజకవర్గాల్లోనే మకాం వేయనున్నట్లు తెలుస్తోంది. 119 నియోజకవర్గాల్లో జాతీయ నాయకులు సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. వారంతా పార్టీ బలోపేతం కోసం కృషి చేయనున్నారు. పార్టీ ఏ నియోజకవర్గంలో వీక్ ఉంది..? బలోపేతం కావాలంటే ఏం చేయాలి...? వంటి సలహాలు, సూచనలు లోకల్ లీడర్లు, టికెట్లు ఆశించే వారికి చెప్పనున్నారు. ఇదే రిపోర్టులను అధిష్టానానికి కూడా పంపించనున్నారు. మరోవైపు.. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో టికెట్లు ఆశిస్తున్న వారు చాలా యాక్టివ్‌గా ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రజాసమస్యలపై పోరాడుతున్నారు.తాజాగా డబుల్ బెడ్ రూం ఇళ్ళ సందర్శన కోసం చలో బాట సింగారం కార్యక్రమానికి కొత్త అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపునిస్తే బీజేపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా హంగామా చేశాయి. కిషన్ రెడ్డి అరెస్టు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా గళమెత్తాయి. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జులై 24న తెలంగాణ వ్యాప్తంగా చాలా చోట్ల ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కీలక నేతలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, బూర నర్సయ్య గౌడ్ వంటివారంతా పాల్గొన్నారు. మరోవైపు మహిళా సంఘాలు, యువజన సంఘాలతో బీజేపీ నేతలు తరచూ భేటీ అవుతున్నారు. పార్టీ బలోపేతం కోసం చేయాల్సిన కార్యాచరణపై సీరియస్‌గా ఫోకస్ పెడుతున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు.. ఇతర పార్టీల నుంచి వచ్చిన సీనియర్ నాయకులకు ముందుగానే టికెట్లు కేటాయించాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అయితే.. బీజేపీలో మాత్రం అంత ఈజీగా టికెట్లు ఖరారు చేయరు. గెలుపు గుర్రాలకే టికెట్లు ఖరారు చేసే అవకాశం ఉంది. మొత్త మ్మీద కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దాదాపు రెండు నెలలపాటు స్తబ్ధుగా వుండిపోయిన కమలనాథుల్లో ఇపుడు కదనోత్సాహం కనిపిస్తోంది. అయితే ఇది బలుపా ? లేక వాపా? అన్నది త్వరలోనే తేలిపోనున్నది.



## భారీ వర్షాలకు తడిసిముద్దయిన ఏజెన్సీ ప్రాంతాలు

**జయభేరి, ములుగు :**

జిల్లాలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతం తడిసి ముద్దయింది. వరదల ధాటికి వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఏజెన్సీలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బోగుల వాగు ఉదృతంగా ప్రవహిస్తూ రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిం ఏజెన్సీ గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ములుగు జిల్లా లో వర్షపాతం 128 మిమి వర్ష పాతం నమోదు..తాడ్వాయి మండలోని మేడారం దగ్గరున్న జంప్పన్న వాగు లోకి భారీగా చేరిన వర్షపు నీటి ప్రవాహానికి జంపన్నవాగు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న షాపులలోకి వరదనీరు చేరి వరదల్లో సామాను కొట్టుకు పోయాయి. తాడ్వాయి, మేడారం ప్రాంతంలో రైతులు పోసిన నారుమడులు కూడా కొట్టుకుపోయాయి. మేడారంలో వరద నీటి ప్రవాహం పెరగడంతో మేడారానికి వచ్చే భక్తులను రావద్దని దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. లక్నవరం సరస్సు లోకి 28 అడుగులకు చేరుకుంది.. బొగుల వాగు ఉద్రుతంగా ప్రవహిస్తుంది..2 రోజులు లో మత్తడి పడే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రామప్ప సరస్సు లో 28 అడుగుల నీరు చేరడంతో చేపల వేటకు వెళ్ళి జనం.. ములుగు జిల్లా కలెక్టర్ జిల్లా ఇలా త్రిపాటి ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది ఇప్పటికే గోదారి పరివాహక ప్రాంతాల్లో రెండు ఎండీ ఆర్ ఆఫ్ బృందాలను రంగంలో దించి సహాయక చర్యలు చేపట్టారు..




## విమానాశ్రయంలో బంగారం పట్టివేత

**జయభేరి, రంగారెడ్డి :**

రంగారెడ్డిజిల్లా శంషాబాద్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్, కస్టమ్స్ అధికారులే తనిఖీలు నిర్వహించారు. కస్టమ్స్ అధికారుల కళ్లు గప్పి తప్పించుకుని విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన స్మగ్లర్లను అధికారులు అదుపులోకి తీసుకన్నారు. ఎయిర్ పోర్ట్ లోని పార్కింగ్ స్థలంలో అనుమానం తో ఇద్దరు వ్యక్తులను సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగులు తనిఖీ చేస్తే 45 లక్షల విలువ చేసే 700 గ్రాముల బంగారం గుట్టురట్టు అయింది. ఇద్దరు ప్రయాణికులు షేక్ చందు భాషా, షేక్ ఆరిఫ్ భాషాలను ను అదుపులోకి తీసుకొని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. నిందితులు కువైట్ నుండి ఇండిగో విమానంలో హైదరాబాద్ కు బంగారాన్ని తీసుకొచ్చినట్లుగా గుర్తించారు.

# గడిచిన ఐదేండ్లలో మొండి బకాయిలే దాదాపు

## రూ.11 లక్షల కోట్లు వెల్లడించిన ఆర్బీఐ గణాంకాలు

**జయభేరి, న్యూఢిల్లీ :**

రుణాలివ్వడం.. వాటిని వసూలు చేయలేక రైటాఫ్ చేయడం బ్యాంకింగ్ రంగంలో ఏటా జరిగే తంతుగానే తయారైంది.పేద, మధ్యతరగతి వర్గాలు ఈఎంఐలు చెల్లించకపోతే నోటీసులు, జప్తులతో విరుచుకుపడే బ్యాంకర్లు.. కార్పొరేట్ల విషయంలో మాత్రం సైలెంట్ అయిపోతున్నారు.ఏటేటా జరుగుతున్న ఈ లోన్ రైటాఫ్‌ల్లో కార్పొరేట్ల మొండి బకాయిలే ఎక్కువగా ఉండటం ఇందుకు నిలువెత్తు నిదర్శనం. అయితే కారకులెవరైనా నష్టపోతున్నది మాత్రం సగటు ప్రజానీకమే. నిజాయితీగా రుణాలు చెల్లిస్తున్నా.. అప్పు మాత్రం పుట్టట్లేదు మరి.దేశీయ బ్యాంకింగ్ రంగంలో లోన్ రైటాఫ్‌లు మళ్లీ పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (202223) రూ.2,09,144 కోట్ల మొండి బకాయిల రైటాఫ్ జరిగింది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరిన వివరాలకుగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా తెలియజేసింది. దీంతో గడిచిన ఐదేండ్లలో రైటాఫ్‌లు రూ.10.57 లక్షల కోట్లకు చేరాయి. అయితే ఖాతా పుస్తకాల బరువును తగ్గించుకునేందుకే ఇదంతా అని, రుణాల వసూలు ప్రక్రియ కొనసాగుతుందని బ్యాంకర్లు చెప్తున్నా.. అంతిమంగా నష్టాల నుంచి మాత్రం తప్పించుకోలేకపోతున్నారు.

**వసూళ్లు అంతంతే..**

ఇచ్చిన రుణాలను తర్వాత వసూలు చేసుకుంటామంటూ ముందుగా రైటాఫ్‌లకు దిగుతున్న బ్యాంకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రికవరీ మొత్తాలను చూస్తేనే ఇది అర్థమవుతున్నది. గడిచిన మూడేండ్ల విషయానికే వస్తే.. 202021 నుంచి 202223 వరకు బ్యాంకులు రూ.5,86,891 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. కానీ వసూలైంది రూ.1,09,186 కోట్లే. అంటే రికవరీ రేటు కేవలం 18.60 శాతంగానే ఉన్నది. 202021లో రూ.30,104 కోట్లు, 202122లో రూ.33,534 కోట్లు, 202223లో రూ.45,548 కోట్లుగా ఉన్నాయి.

**రైటాఫ్‌లు చేయడం వల్లే..**

బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు గణనీయంగా తగ్గుతున్నాయంటూ ఇటీవలికాలంలో బ్యాంకర్లు గొప్పలు చెప్పుకుంటున్నది చూస్తూనే ఉన్నాం. అయితే లోన్ రైటాఫ్‌లే ఇందుకు కారణమని నిపుణులు చెప్తున్నారు. అందుకు తగ్గట్టు గణాంకాలూ ఉన్నాయి మరి. లోన్ రైటాఫ్‌ల నేపథ్యంలో మొత్తం రుణాల్లో బ్యాంకర్ల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి పదేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి 3.9 శాతానికి దిగింది. 201718లో రూ.10.21 లక్షల కోట్లుగా ఉన్న జీఎన్‌పీఏ.. 202223కల్లా రూ.5.55 లక్షల కోట్లకు వచ్చినట్టు బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. వాస్తవానికి ఈ రైటాఫ్‌లు లేకపోతే జీఎన్‌పీఏ నిష్పత్తి 7.47 శాతంగా ఉండేదని ఎక్స్‌పర్టన్ పేర్కొంటున్నారు.

202122లో లోన్ రైటాఫ్‌లు రూ.1,74,966 కోట్లు
202021లో రూ.2,02,781 కోట్లు.
201213 నుంచి ఇప్పటిదాకా లోన్ రైటాఫ్‌ల విలువ రూ.15,31,453 కోట్లు.




గడిచిన మూడేండ్లలో దేశీయ బ్యాంకింగ్ రంగంలో జరిగిన లోన్ రైటాఫ్‌ల్లో ప్రభుత్వ బ్యాంకుల వాటానే సుమారు 62.45 శాతం. 202021 నుంచి 2022 23 వరకు పీఎస్‌యూ బ్యాంకులు రూ.3,66,380 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి

**లోన్ రైటాఫ్ అంటే?**

బ్యాంకు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి రుణం తీసుకున్నవారు 90 రోజులు, అంతకంటే ఎక్కువకాలంపాటు దాన్ని చెల్లించడంలో విఫలమైనప్పుడు.. సదరు అప్పు ఇచ్చిన సంస్థ ఆ లోన్‌ను నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ లేదా మొండి బకాయి)గా ప్రకటిస్తుంది. దీన్ని ఖాతా పుస్తకాల నుంచి తొలగించడమే లోన్ రైటాఫ్

**రైటాఫ్ చేస్తే ఏం జరుగుతుంది?**

రుణాన్ని రైటాఫ్ చేయడం అంటే.. అసెట్ బుక్ నుంచి దాన్ని తొలగించినట్టే. అంతేగాక రుణం వసూలు చేసేందుకున్న అవకాశాలు చాలాచాలా తక్కువని రుణదాతలు (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు) అంగీకరించినట్టే. ఈ రుణాన్ని నష్టంగా రుణదాతలు నమోదు చేసుకుంటారు. సంస్థ లాభాల్లో నుంచి ఆ మొత్తాన్ని మినహాయిస్తారు. దీనివల్ల పన్ను భారం తగ్గుతుందని రుణదాతలు చెప్తున్నారు. అయితే ఎన్‌పీఏల వసూలు ప్రక్రియ కొనసాగుతుందని అంటున్నా.. ఆశించిన స్థాయిలో మాత్రం ఫలితం ఉండదని బ్యాంకింగ్ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

# చిత్తడి చిత్తడిగా మహానగరం

**జయభేరి, హైదరాబాద్ :**

మియాపూర్, మూసాపేట్, కూకట్‌పల్లిలో 4 సెం.మీ వర్షం కురిసింది. తిరుమలగిరి, కేపీహెచ్‌బీ, జీడిమెట్లలో 3 సెం.మీవర్షం పటాన్‌చెరు, వెస్ట్ మారేడుపల్లి, గాజులరామారం..కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరిలో 3 సెం.మీ వర్షపాతం నమోదయ్యింది. ఇక బాలానగర్, ఖైరతాబాద్, చందానగర్, బోరబండ, ఆర్సీపురం, హఫీజ్‌పేటలో 2.5 సెం.మీ, ముషీరాబాద్, సికింద్రాబాద్, కాప్రా...మల్కాజ్‌గిరిలో 2 సెం.మీ వర్షపాతం నమోదయ్యింది.భారీ వర్షంతో ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కుండపోత వానతో వాహనదారులు నరకయాతన అనుభవించారు. హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు.. భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సైబరాబాద్ ట్రాఫిక్ DCP నగర ట్రాఫిక్ పరిస్థితిని పర్యవేక్షించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ నదుల్లా మారాయి. జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరికలు జారీచేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు DRF బృందాలు రంగంలోకి దిగాయి. మరోవైపు భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని గవర్నర్ తమిళిసై ట్వీట్ చేశారు. మలక్‌పేట్, సరూర్‌నగర్, మియాపూర్‌లలో 5 సెం.మీ.వర్షం పడింది. ఖైరతాబాద్, జీడిమెట్ల, రాజేంద్రనగర్, అంబర్‌పేట్, తిరుమలగిరిలలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.చందానగర్, సంతోష్‌నగర్, కార్వాన్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, పటాన్‌చెరులలోనూ 4 సెం.మీ. వర్షం కురిసింది. మూసారాంబాగ్ బ్రిడ్జిపై వరదనీరు పొంగిపొర్లుతోంది. మరోవైపు లంగర్ హౌస్ పై పిడుగు పడింది. ఇదిలా ఉంటే ఇప్పటికే హైదరాబాద్‌లో కొనసాగుతోంది ఎల్లో అలర్ట్. మరోవైపు రేపు హైదరాబాద్‌కు ఆరెంజ్ అలర్ట్ ప్రకటన చేసింది వాతావరణ శాఖ. మరో మూడు రోజుల పాటు అతి భారీ వర్షాలు ఉండడంతో అధికారులు ఎలర్ట్ అయ్యారు. నగర వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఐకియా జంక్షన్, హైటెక్ సిటీ, కేబుల్ బ్రిడ్జి పరిసరాల్లో భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.భారీ వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ కావడంతో.. ట్రాఫిక్ డిసిపి రంగం లోకి దిగి క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశారు. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ రూట్ కి ఆల్టర్నేటివ్ రూట్ లను చూశారు. వర్ష తీవ్రత పెరగడంతో ఏకంగా సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర రంగంలోకి దిగి.. క్షేత్రస్థాయిలో అక్కడ పరిస్థితిని సమీక్షించేందుకు సిపి స్టీఫెన్ రవీంద్ర ఐక్య రోటరీ వద్ద చేరుకొని వర్షం లో తడుస్తూ అధికారులకు ఇన్స్ట్రక్షన్ ఇస్తూ సిపి ఆన్ రైన్ డ్యూటీ అన్నట్టు సిద్ధమయ్యారు. సైబరాబాద్ కమిషనర్ రైన్ డ్యూటీలో ఉండటంతో వాహనదారులు పోలీసుల తీరును ప్రశంసిస్తున్నారు.

**కుతుబ్ మినార్ ధ్వంసం**

లంగర్ హౌజ్ వద్ద కుతుబ్ షాహీ కాలం నాటి మసీదుపై పిడుగు పడింది. దీంతో మినార్ చాలా వరకు దెబ్బతింది. భారీ వర్షం కురుస్తున్న టైంలో మసీదుపై పిడుగు పడిందని స్థానికులు చెప్పారు దీంతో మినార్ ధ్వంసమైంది. దాని శకలాలు విరిగి నేలపై పడ్డాయి. మసీదును పరిశీలించిన నిర్వాహక కమిటీ సభ్యులు యాంప్లిఫైయర్లు, వైరింగ్ వంటి విద్యుత్ ఉపకరణాలు చాలా వరకు పాడైపోయాయని గుర్తించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మసీదును సందర్శించి నిర్వహణ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సమస్యను తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.జీహెచ్ఎంసీ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాలకు ఓ అపార్ట్‌మెంట్ వద్ద గోడ కూలింది. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు అమీర్‌పేట సమీపంలోని దివ్య శక్తి అపార్ట్‌మెంట్ లో సహాయకచర్యలు చేపట్టాయి. భారీ వర్షం కారణంగా రెండో అంతస్తులో ఉన్న ఫ్లాట్ గోడ కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బృందాలు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకొని శిథిలాలను తొలగించాయి. కుండపోత వర్షం హైదరాబాద్ వాసులకు చుక్కలు చూపించింది. సాయంత్రం చాలా మంది పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే టైంలో పడిన వర్షంతో నగర ప్రజలు నరకయాతన అనుభవించారు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎటు చూసిన వర్షపు నీరు, వాహనాల బారులు. హైదరాబాద్‌లో ఉరుములతో కూడిన వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్థం చేసేసింది. అసలే సాయంత్రం ఐదు గంటలు దాటితే హైదరాబాద్‌లో ట్రాఫిక్ అంతా ఇంతా కాదు. అలాంటిది ఆ టైంలో వర్షం పడితే ఏమైనా ఉంటుందా. సోమవారం కూడా అదే జరిగింది. ఏ రోడ్డులో చూసిన వాహనాల బారులే కనిపించాయి. ఓవైపు వర్షం ఇంకోవైపు ట్రాఫిక్, వారిని నియంత్రించడానికి పోలీసులకు కూడా చుక్కలు కనిపించాయి. హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం కురిసిన వానతో నగరంలోని రోడ్డులు నదీ ప్రవాహాన్ని తలపించాయి. చాలా ప్రాంతాల్లో మోకాళ్ల లోతులో నీరు నిలిచిపోయింది. ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. అటు హైటెక్‌సిటీ నుంచి ఇటు నాగోల్, ఎల్బీనగర్, మెహదీపట్నం, మలక్‌పేట, ఇలా ఎటు చూసిన ట్రాఫిక్ నిలిచిపోయింది. సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఇదే పరిస్థితి కనిపించింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర నేరుగా రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.


# కళకళలాడుతున్న గోదావరి బేసిన్ జలాశయాలు

## శ్రీరామసాగర్, నిజాంసాగర్ లకు పెరిగిన ప్రవాహాలు..

## రైతన్నలకు వరంగా మారిన వర్షాలు .. జోరుగా వ్యవసాయ పనులు

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరి బేసిన్ ప్రాజెక్టు జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల ఉద్ధృతిలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. గోదావరి పరీవాహక ప్రాంత ప్రాజెక్టులకూ వరద ప్రవాహాలు పెరిగాయి. శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు 1,21,008 ఇన్ ఫ్లో ఉండగా... 882 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలకు గాను,63.47 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఇప్పటికే నిండిన నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 48,475 క్యూసెక్కులు, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 22.440 క్యూసెక్కుల వరద వస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు ప్రస్తుతం 5.99 క్యూసెక్కుల వరద వస్తుండగా, 385 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.48 టీఎంసీలకు చేరుకుంది. మేడిగడ్డ వద్ద లక్ష్మీ బ్యారేజీకి 5,49,210 క్యూసెక్కుల వరద వస్తోంది. 5.49 లక్షల క్యూసెక్కుల నీటిని 75 గేట్ల ద్వారా వదులుతున్నారు. సింగూరు ప్రాజెక్టు లో ఇప్పటివరకు 21.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 11.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 17.80 టీఎంసీలు. అదేవిధంగా శ్రీరామసాగర్ ప్రాజెక్టులో 63.47 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 7.60 టీఎంసీలు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.01 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. లోయర్ మానేరు రిజర్వాయర్ లో 24.07 టీఎంసీలు ప్రాజెక్టు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 12.89 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదేవిధంగా మిడ్ మానేరు రిజర్వాయర్ లో 27.50 టీఎంసీల నీటీ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 15.72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు రైతన్నలకు వరంగా మారాయి. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని
# సీఎంకు పోస్ట్ కార్డు సందేశం

**జయభేరి, మేడిపల్లి :**





తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల సమస్యల పట్ల సీఎం కేసీఆర్ మనసు మారాలని టియుడబ్ల్యూజే ఐజేయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.వెంకట్ రాం రెడ్డి అన్నారు.ఈ మేరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి గాను టీయూడబ్ల్యూజే ఐజెయూ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా నిర్వహించిన పోస్ట్ కార్డు... ఉద్యమాన్ని మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కల్యూరి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి చిర్ర శ్రీధర్ రెడ్డి ల అధ్వర్యంలో బోడుప్పల్ నగర పాలక సంస్థ పోస్టాఫీసు కార్యాలయం వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట్ రాంరెడ్డి,మేడిపల్లి అధ్యక్షుడు కల్యూరి ఎల్లయ్య లు మాట్లాడుతూ... నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి గాను అనేక హామీలు ఇవ్వడంతో పాటు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫేస్టో లో కూడా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలు ల,అరోగ్య భద్రతా కల్పించేందుకు కృషి చేస్తానని హమీ ఇచ్చారని కానీ కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయి తొమ్మిది సంవత్సరాలు గడిచిన నేటికీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు.రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నామని చెప్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులకు ఎందుకు న్యాయం చేయాడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా నైన ముఖ్యమంత్రి మనసు మారాలని,జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చెయ్యాలని లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి ఎన్. రాములు యాదవ్, ముఖ్య సలహా దారు వీఎస్ఎన్ రెడ్డి, కో అర్డినేటర్ ఎన్.అంజన్ కుమార్, ఉపాధ్యక్షులు అర్. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి వి.సుందర్,సీహెచ్ రమేష్, సలహాదారులు ఎస్.సాగర్ రెడ్డి, జీ.కుమార స్వామి, కార్యవర్గ సభ్యులు భూష గణేష్, చిన్నం మధు, చిన్నం గణేష్, మరాటి మత్స్యగిరి, రావు నాగిరెడ్డి, భగిరథ రెడ్డి, క్లబ్ సభ్యులు మోతె రఘు తిరుపతి రెడ్డి, శేరి కరుణాకర్ రెడ్డి, సందీప్ రెడ్డి, మరాఠి మల్లేష్, సాయి రామ్, నరేందర్ పాల్గొన్నారు.

## సానుకూలంగా సంబందించిన కమీషనర్

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ ఎన్ఐఎన్ కాలనీ పెద్దలు స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి కార్యాలయంలో కలిసి... ఎన్ఐఎన్ కాలనీకి సంబందించిన ఇబ్బందులను వివరించి కార్పొరేటర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ ఎన్ఐఎన్ కాలనీ పెద్దలను బోడుప్పల్ మున్సిపల్ కమీషనర్ వేణుగోపాల్ రెడ్డి దగ్గరికి తీసుకొనీవేళ్లి ఎన్ఐఎన్ కాలనీ వాసులు పడుతున్నటువంటి ఇబ్బందులను వివరించడం జరిగింది. కమీషనర్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో కాలనీ పెద్దలు వివరించిన సమస్యలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, పబ్బు సత్యనారాయణ, బిక్షమా చారి, రైల్వే సత్యనారాయణ, బ్యాంక్ మల్లయ్య, బాలాజీ నాయక్, నిగమ్, శంకర చర్య, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మణిపూర్ ఘటన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి



**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ బస్ డిపో ముందు మణిపూర్ ఘటనపై నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ని ఉద్దేశించి మాట్లాడుతూ మణిపూర్ లో కుకీ జాతికి చెందిన మహిళలని వివస్త్రలీ నీ చేసి అమానుషంగా జరిపిన బహిరంగ ప్రదర్శన చేయడం చాలా బాధాకరమని వ్యక్తం చేశారు. ఒక మహిళ భర్త, తనయుడిని హత్య చేసి, ఇరువురి మహిళలను సామూహికంగా మానభంగం చేసిన ఘటన స్వతంత్ర భారతం రాక్షసులతో నిండి ఉందా అనే ప్రశ్నను సంధిస్తున్నది. అన్నారు. మణిపూర్ కి గొప్ప చరిత్ర ఉంది నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత జెండాను తొలిసారిగా ఎగరవేసిన ప్రాంతం మణిపూర్. బ్రిటిష్ నుంచి ఈ ప్రాంతాన్ని ఇండియన్ నేషనల్ ఆర్మీ విముక్తి చేసింది. అలాగే పోలో క్రీడా కూడా ఇక్కడే పుట్టింది. బ్రిటిష్ పాలకులు ఈ ఆటను ఇంగ్లాండ్ తీసుకెళ్లి మరి మెరుగులు దిద్దారు. అనంతరం ఈ ఆట ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. చారిత్రిక పురాణాల కాలంలో కూడా మణిపూర్ ప్రస్తావముంది. ఇక్కడ మనులు విరివిగా లభించేవి ఇలాంటి ప్రాముఖ్యత గల ప్రాంతంలో ఈ విధమైన ఘటన జరగడం బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ,జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె.లక్ష్మి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే ప్రమీల, ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి ఎం డి అన్వర్, మేడిపల్లి మండల మహిళా సమాఖ్య కార్యదర్శి& అధ్యక్షులు సి.హెచ్ మాధవి, జ్యోతి, బి కే ఎం యు మండల కార్యదర్శి& అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, శాఖ కార్యదర్శులు మాచర్ల కనకయ్య, కొమురయ్య, సిపిఐ నాయకులు ఇస్తారు, సోమరాజు, నాగరాజు, లక్ష్మమ్మ, సత్తమ్మ, కొమురమ్మ ఏఐఎస్ఎఫ్ మండల్ నాయకులు హరీష్, చినబాబు, అంజి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరెడ్డి కి యంగ్ అచీవర్స్ అవార్డు

**జయభేరి, మేడిపల్లి :**




నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2023 సంవత్సరానికి యంగ్ అచీవర్స్ అవార్డ్ కి ఎంపికైన రెడ్డీస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి. తన రంగంలో తాను సాధించిన విజయాలు, సహకారాలు ఈ అవార్డుకు ఎంపిక చేశాయి. మంగళవారం నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన టీఎస్ ఐఐసి జోనల్ మేనేజర్ నేజర్ మాధవి సుధీర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా యంగ్ ఆచీవర్స్ అవార్డు గ్రహీత ఎ. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... యంగ్ అచీవర్స్ 2023 అవార్డుకు ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. ఈ రంగంలో అత్యుత్తమ విజయాలు అందుకొని రంగానికి చేసిన సహాయ సహకారాలు మమ్మల్ని ఆకట్టుకున్నాయని తెలిపారు. మా కంపెనీ యువ తరానికి నిజమైన స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ అవార్డు అందుకోవడం సమిష్టి కృషి అని కొనియాడారు.



## ఓఅర్అర్ ఫేస్2 నూతన పైప్ లైన్ పనులను పర్యవేక్షించిన

**జయభేరి, ఉప్పల్ :**

సిసి రోడ్లతోపాటు నూతన మంచినీటి పైప్లైన్ స్వల్ప వ్యవధిలోని వేయిస్తున్న కార్పొరేటర్ బన్నాల కు బస్తీ వాసుల ప్రశంస. చిల్కానగర్ డివిజన్ మల్లికార్జున నగర్ లో సిసి రోడ్లు నిర్మాణంతో పాటు మంచినీటి పైపులైను వేయించాలని కాలనీ వాసుల అభ్యర్థన మేరకు స్వల్ప వ్యవధిలోనే ఓఆర్ఆర్ పేస్టు 2 మంచినీటి పైప్లైన్ శాంక్షన్ చేయించిన చిలకనగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ను మల్లికార్జున్ నగర్ వాసులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ ప్రజల మౌలిక సదుపాయాల కల్పన లో ముందుండి పని పనిచేస్తున్నామనీ డివిజన్ సమగ్ర అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, నారాయణరెడ్డి, ఉపేందర్, సుందర్, అశోక్ చారి, అల్లి బిల్లీ మహేందర్, సంతోష్, బలెందర్, శివ, బాలు, శ్యామ్, పెద్ద ఎత్తున బస్తివాసులు పాల్గొన్నారు.

## పోస్ట్ కార్డు ఆందోళనలో జర్నలిస్టులు పాల్గొనాలి

**జిల్లా జర్నలిస్టులకు పిలుపు నిచ్చిన టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్**



**జయభేరి, రంగారెడ్డి :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన పోస్ట్ కార్డు ఆందోళన కార్యక్రమంలో జిల్లాలోని జర్నలిస్టులంతా పాలుపంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కోరారు. టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కమిటీ సూచనల మేరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు రాసే ఆందోళన చేపట్టామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులను తెలంగాణ ప్రభుత్వం విస్మరించడం విచారకరమని ఆయన అన్నారు. తెలంగాణలోని అన్ని వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ జర్నలిస్టుల విషయంలో మాత్రం ఏ విధమైన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని పలుమార్లు ప్రశంసించినప్పటికీ సంక్షేమ విషయంలో మాత్రం విస్మరిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా జర్నలిస్టులకు ఇల్లు, ఇంటి స్థలాల సమస్యను వెంటనే పరిష్కరింప చేయాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం ఏర్పాటుచేసిన జేహెచ్ఎస్ ను పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానంగా ఈ రెండు డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డులను పెద్ద సంఖ్యలో ప్రగతి భవన్ పంపి ఆందోళన చేపడతామన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని జర్నలిస్టులు పోస్ట్ కార్డులను ప్రగతి భవన్ కు చేరేలా పోస్ట్ చేసి ఆందోళనలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## కమిషనర్.. 15వ డివిజన్ ను అభివృద్ధి పరచండి!

**మున్సిపల్ కమిషనర్ కు కార్పొరేటర్ కొత్తదుర్గమ్మ వినతి**

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ అభివృద్ధిలో వెనుకబడిందని, కమిషనర్ పర్యటించి డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని అదే విధంగా బోడుప్పల్ చెంగిచెర్ల ప్రధాన రహదారి నుండి టెలిఫోన్ కాలనీ మీదుగా హై టెన్షన్ వైర్ల కింద బోడుప్పల్ బొల్లిగూడెం 60 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.



బోడుప్పల్ నగర పాలక సంస్థ ఇందిరానగర్ కాలనీ లో నివాసం ఉంటున్న K వినోద్ వారి బాబు సాయి చరణ్ అనారోగ్య రీత్యా ఆసుపత్రి లో వైద్యం పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరు అయిన 60,000 చెక్కును మేయర్ సామల బుచ్చిరెడ్డి నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీరాల నర్సింహా, సీనియర్ నాయకులు కాటేపల్లి రామచంద్ర రెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్ పాల్గొన్నారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి



## కాలనీ సమస్యలపై స్పందించిన కార్పొరేటర్

**జయభేరి, మేడిపల్లి :**

ద్వారకానగర్, శ్రీనివాస కాలని లో పలు సమస్యలపై స్పందించిన కార్పొరేటర్ మొదుగు లావణ్య శేఖర్ రెడ్డి. వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా నగర వీధుల్లో పలు సమస్యలు నెలకొన్నాయి. నగర వాసులు కార్పొరేటర్ మొదుగు లావణ్య శేఖర్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. కార్పొరేటర్ దృష్టికి రాగానే తక్షణమే సమస్యలపై స్పందించి అధికారులతో ఇబ్బంది గురైన ప్రాంతాలకు ద్వారకానగర్ కాలని అధ్యక్షులు, సీనియర్ నాయకులు మొదుగు శేఖర్ రెడ్డి వెళ్ళడం జరిగింది. అక్కడ పరిశీలించి సమస్యల గురించి తెలుసుకుని వెంటనే మున్సిపల్ సిబ్బందిని రప్పించి సమస్యను పరిష్కరించడం జరిగింది. అక్కడ ప్రధానంగా నాలా వద్ద ఉన్న రహదారి వరదల కారణంగా ఇబ్బంకి గురవడంలో వాహనాల రాకపోవడాలు నిలిచివేయబడ్డాయి.వేంటనే జేసీబీ(JCB)తో రహదారిని సరి చేయించి రాకపోవడాలకు సులభం చేయించారు మొదుగు శేఖర్ రెడ్డి. తరువాత వీధుల్లో కొన్ని చోట్ల వరదపు నీటి వల్ల డ్రైవేజ్ ఉప్పొంగడంతో నగర వాసులు ఇబ్బంది గురయ్యారు. దీనిపై కూడా వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందితో పనులు ప్రారంభించడం జరిగింది. నగర వాసులు కార్పొరేటర్ మొదుగు లావణ్య శేఖర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేసారు.



## గల్ఫ్ కార్మికులు కుటుంబంతో జీవించే హక్కును అమలు చేయాలి

**జయభేరి, జగిత్యాల :**

వలస కార్మికుల సామాజిక రక్షణ అనే అంశం పై మలేషియా రాజధాని కౌలాలంపూర్ లో జరుగుతున్న బహుళ దేశాల ప్రాంతీయ సమావేశంలో గల్ఫ్ వలస వ్యవహారాల నిపుణుడు మంద భీంరెడ్డి కి రియాక్టర్ (విషయంపై పరిజ్ఞానం కలిగి చర్చపై ప్రతిస్పందించే వ్యక్తి) గా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఒకనెల వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఉద్యోగ ఒప్పందాలలో ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. గల్ఫ్ కార్మికులు స్వదేశంలో కుటుంబంతో జీవించే హక్కును కాపాడాలని ఆయన కోరారు. అంతర్జాతీయ వలస కార్మికులకు ఆన్ లైన్ ఓటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉన్నదని వచ్చే సంవత్సరం భారత్, ఇండోనేషియా, బాంగ్లాదేశ్ లలో జరిగే జాతీయ ఎన్నికలలో ప్రవాసుల ప్రభావం ఉంటుందని భీంరెడ్డి అన్నారు. ఫిలిప్పీన్ కేంద్రంగా పనిచేసే మైగ్రెంట్ ఫోరమ్ ఇన్ ఏసియా అనే సంస్థ నిర్వహించిన ఆగ్నేయ ఆసియా, దక్షిణ ఆసియా, గల్ఫ్ మధ్యప్రాచ్య దేశాల ప్రతినిధుల సమావేశాన్ని ఈనెల 24, 25 రెండు రోజులు పాటు జరిగింది. లెబనాన్ రాజధాని బీరుట్ లో ఉన్న అరబ్ దేశాల ఐఎల్ఓ (అంతర్జాతీయ కార్మిక సంఘం) ప్రాంతీయ కార్యాలయం సోషల్ ప్రొటెక్షన్ టెక్నికల్ ఆఫీసర్ డా. లియాబూ కాటర్ వలస కార్మికుల సామాజిక రక్షణ (సోషల్ ప్రొటెక్షన్), సామాజిక భద్రత (సోషల్ సెక్యూరిటీ), విశ్వవ్యాప్త సామాజిక రక్షణ అంతస్తులు (యూనివర్సల్ సోషల్ ప్రొటెక్షన్ ఫ్లోర్స్) అంటే ఏమిటి? ఎందుకు? అనే విషయంపై వివరణాత్మకంగా ప్రసంగించారు. డా. రేణు అధికారి (నేపాల్), ఫిష్ ఐపి (ఇంటర్నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్), విలియమ్స్ (ఫిలిప్పీన్స్) లు వివిధ దేశాలలో ఉన్న సామాజిక రక్షణ పథకాల గురించి వివరించారు.



## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా అజిత్ పవార్?

**జయభేరి, ముంబై :**

మహారాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. పార్టీలపై నేతల తిరుగుబాటుతో ఇప్పటికే మహా రాజకీయాలు సంచలనంగా మారాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ని రెండు ముక్కలుగా చీల్చిన అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిఫలంగా మహా సీఎం ఏక్‌నాథ్ షిండే అజిత్‌పవార్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. అంతే కాకుండా పవార్ వర్గం ఎమ్మెల్యేలు తొమ్మిది మందిని తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు. ఈ అనూహ్య పరిణామాలతో మహరాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. ఎక్కడ చూసినా రాష్ట్రంలోని రాజకీయ పరిణామాల గురించే వాడీవేడిగా చర్చ జరుగుతోంది.ఈ నేపథ్యంలో త్వరలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మారబోతున్నారంటూ వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్థానాన్ని అజిత్ పవార్ భర్తీ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. త్వరలో మహా ముఖ్యమంత్రిగా అజిత్ పవార్ బాధ్యతలు చేపట్టబోతున్నారంటూ కొందరు ఇప్పటికే వ్యాఖ్యానించారు కూడా. మహా ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ కూడా ఇటీవలే మాట్లాడారు. ఆగస్టు 10 నాటికి షిండే స్థానంలోకి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న అజిత్ పవార్ వస్తారని వ్యాఖ్యానించారు. వార్తల నేపథ్యంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తాజాగా స్పందించారు. ముఖ్యమంత్రి మార్పుపై స్పష్టతనిచ్చారు. అజిత్ పవార్ ముఖ్యమంత్రిగా ఎదగబోరని.. ఏక్ నాథ్ షిండేనే సీఎం పదవిలో కొనసాగుతారని స్పష్టం చేశారు. ‘మహాకూటమి నాయకుడిగా నేను ఒక విషయం స్పష్టం చేయాలని అనుకుంటున్నాను. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్ నాథ్ షిండేనే కొనసాగుతారు. ఇందులో ఎటువంటి మార్పూ ఉండదు’ అని విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ‘పార్టీ కార్యకర్తలు తమ నాయకుడు సీఎం కావాలని కోరుతూ అప్పుడప్పుడు తమ అంచనాలను వ్యక్తం చేయొచ్చు. ఆగస్టు 10న జరిగే సంఘటనల గురించి పృథ్వీ బాబా చెప్పిన అంచనాలు నిజం కావు. త్వరలో జరగబోయేది పెండింగ్ లో ఉన్న మంత్రివర్గ విస్తరణ. సీఎం షిండే తేదీని ఖరారు చేస్తారు’ అని ఫడ్నవీస్ పేర్కొన్నారు.

# ఆపత్కాలంలో అండ సీఎం సహాయ నిధి



**జయభేరి, మేడిపల్లి :**

ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 26వ వార్డ్ డివిజన్ కార్యాలయం లో కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి బాధితులకు స్వయానా అందించడం జరిగింది. 1. జి సులోచన రూ. 100000/ 2.జి. వేణుగోపాల్ రావు రూ. 100000/ 3. సులోచన రూ. 100000/ ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆపత్కాలంలో మంత్రి చామకూర మల్లారెడ్డి అండగా ఉంటున్నారని, వారికి ఎప్పటికి రుణ పడి ఉంటామని వారు అన్నారు.

# సింగిల్ కార్డులో ప్రజా రవాణా

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో, ఆర్టీసీ, లోకల్ ట్రైన్స్, క్యాబ్, ఆటో ఇలా ప్రజా రవాణాకు సంబంధించి కామన్ మొబిలిటీ కార్డు తీసుకురావాలని నిర్ణయించింది. హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుంది. ఐటీ పరిశ్రమలో దూసుకుపోతున్న భాగ్యనగరంలో ప్రజా రవాణాను సులభతరం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ లో ప్రజారవాణాను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం కామన్ మొబిలిటీ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ మెట్రో రైలు, టీఎస్ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్, క్యాబ్, ఆటో సర్వీసులను అనుసంధానిస్తూ కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి తీసుకురానుంది. మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్.. మెట్రో, టీఎస్ఆర్టీసీ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.హైదరాబాద్ మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులు చేపడుతోంది. ప్రజల జీవన విధానాన్ని సులభతరం చేసేందుకు కీలక పథకాలు అందుబాటులోకి తీసుకువస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ప్రజా రవాణా వ్యవస్థ మరింత పటిష్ఠంగా మారనుంది. తెలంగాణ ప్రభుత్వం... త్వరలో కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి తీసుకురానుంది. హైదరాబాద్ లో ప్రజా రవాణా వ్యవస్థలో కామన్ మొబిలిటీ



కార్డు కీలకంగా మారనున్నట్లు అధికారులు అంటున్నారు. ఆగస్టు రెండో వారం నుంచి కామన్ మొబిలిటీ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేయాలని మెట్రో, ఆర్టీసీ అధికారులను కేటీఆర్ ఆదేశించారు.

కామన్ మొబిలిటీ కార్డు ద్వారా మెట్రో రైలు, టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఇకపై ప్రయాణం సులభతరం కానుంది. మొబిలిటీ కార్డు సక్సెస్ అయితే ఎంఎంటీఎస్, క్యాబ్స్, షేర్ ఆటోలు, రిటైల్ సంస్థలకు ఈ సేవలను విస్తరిస్తామని పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ తెలిపారు. నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులో ఉన్న ఇతర నగరాల్లో ఈ కార్డును వినియోగించవచ్చని ఆయన చెప్పారు. ఇకపై ప్రయాణాలకు ఒకే కార్డు ఉపయోగపడుతుందన్నారు. ముందు హైదరాబాద్ నగరంలో కామన్ మొబిలిటీ కార్డు ప్రారంభించి, అనంతరం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తుంది. ప్రయాణానికి మాత్రమే కాకుండా ఇతర లావాదేవీలకు ఈ కార్డు ఉపయోగపడేలా మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రభుత్వం జారీ చేసే కామన్ మొబిలిటీ కార్డుతో ఇతర మెట్రో నగరాలకు వెళ్లినప్పుడు అక్కడి ఆర్టీసీ బస్సులు లేదా మెట్రో రైల్ ఇతర ప్రజా రవాణా వ్యవస్థను ఎలాంటి సమస్యలు లేకుండా సులభంగా వినియోగించేందుకు వీలు కలుగుతుందని అధికారులు అంటున్నారు. ఈ కార్డును ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్ లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని మంత్రులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా తెలంగాణ సర్కార్ జారీ చేసే కామన్ మొబిలిటీ కార్డుకి ఒక పేరు సూచించాలని కోరారు.

# మళ్లీ ఈస్ట్ ఇండియా కంపెనీ అడుగులా

**జయభేరి, న్యూఢిల్లీ :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా నాలుగో రోజు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. ఈ రోజు కూడా ఉభయ సభల్లో (లోక్ సభ, రాజ్య సభ) గందరగోళం నెలకొంది. మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. ఇవాళ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే తాము సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని అధికార పక్షం ఎదురు దాడి చేసింది. ఇండియా పక్షాలను ఈస్ట్‌ఇండియా కంపెనీతో ప్రధాని మోదీ పోలుస్తూ విమర్శలు చేసారు. అధికార విపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలు, కౌంటర్ ఎన్‌కౌంటర్ కామెంట్స్‌తో ఈసారి కూడా పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగడం లేదు. ఎన్డీఏ, ఇండియా రెండు పార్టీలు కూడా మణిపూర్ హింసాకాండను అడ్డుపెట్టుకొని ఒకరినొకరు దూషించుకుంటున్నారు. సభను వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి సభా కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి.

బీజేపీ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని ఇండియన్ ముజాహిదీన్‌తో పోల్చారు. 'ప్రధానిని చూసి గర్విస్తున్నాం. నేడు ఇండియన్ ముజాహిదీన్ కూటమితో రాజకీయాలు చేస్తున్నారు. 2024లో తాము అధికారంలోకి రాలేమని ప్రతిపక్షాలు అంగీకరించాయి. మణిపూర్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే వాయిదా తీర్మానం పెట్టి ఏం లాభం అని రాజ్య సభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కర్ ప్రశ్నించారు. అదే సమయంలో రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌ల లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కూడా చర్చించాలని ఎంపీ పీయూష్ గోయల్ అన్నారు.

**ఇండియన్ ముజాహిదీన్', 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాలో కూడా ఇండియా ఉంది: మోదీ**

విపక్షాలు పూర్తిగా దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విరుచుకుపడ్డారు. ప్రధాని 'ఇండియా' కూటమిని బ్రిటిష్ వారి ఈస్ట్ ఇండియా కంపెనీ, PFI వంటి తీవ్రవాద సంస్థలతో పోల్చారు. నిరసన తెలపడమే ప్రతిపక్షాల పని అని, తమ పార్టీ నేతలు పనిపై దృష్టి పెట్టాలని కోరారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని.. మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."...బ్రిటిషర్లు వచ్చి తమకు ఈస్టిండియా కంపెనీ అని పేరు పెట్టుకున్నట్లే, విపక్షం కూడా ఇండియా పేరుతో తమను తాము ప్రదర్శిస్తోంది," అని ప్రధాని ప్రతిపక్షాలను హేళన చేస్తూ అన్నారు. 'ఇండియన్ ముజాహిదీన్', 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)' వంటి తీవ్రవాద సంస్థల్లో కూడా 'ఇండియా' ఉందని ప్రధాని తీవ్ర స్థాయిలో దాడి చేశారు.

**ప్రధాని స్పందించే వరకు ప్రతిష్టంభన కొనసాగుతుంది: సంజయ్ సింగ్**

ప్రధాని స్పందించే వరకు ప్రతిష్టంభన కొనసాగుతుందని, ప్రధాని సమాధానం చెప్పాల్సి ఉంటుందని పార్లమెంట్ హౌస్ ఆవరణలో బైఠాయించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. తనను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణంలో కూర్చొని నిరసన చేపట్టారు. సంజయ్ సింగ్ సస్పెన్షన్ పై రాజ్యసభ ఎంపీ జేబీ మాథేర్ మాట్లాడుతూ.. సంజయ్ సింగ్ ఒక్కరే కాదు, ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై ఉన్నాయి. మా ఎంపీల్లో ఒకరిని సస్పెండ్ చేయడం ద్వారా బెదిరించవచ్చని అధికార ప్రభుత్వం భావిస్తే... ఇంకా గట్టిగా డిమాండ్ చేస్తాం. ప్రధాని పార్లమెంటుకు వచ్చి మణిపూర్ పై ప్రకటన చేయాలి, ఆ తర్వాత సమగ్రంగా చర్చించాలన్నారు.

**ప్రధాని 'బేటీ బచావో' నినాదం ఏమైంది?**

మణిపూర్ హింసాకాండపై ప్రధాని సమాధానం చెప్పాలన్నదే తమ డిమాండ్ అన్నారు విపక్ష ఎంపీలు. సోమవారం నుంచి గాంధీ విగ్రహం వద్దే కూర్చొని ఉన్న ఎంపీలు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. మణిపూర్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని గుర్తు చేసారు. పార్లమెంటులో ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. 'బేటీ బచావో' అనే ప్రధాని నినాదం ఏమైందని ప్రశ్నించారు.

# మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు

## విద్యార్ధులను ఇబ్బంది పెట్టారని కాంగ్రెస్ నేతల పిర్యాదు

**జయభేరి, హైదరాబాద్ :**

కేటీఆర్ జన్మదినం సందర్భంగా చొప్పదండి నియోజకవర్గంలో చిన్న పిల్లలను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమీషన్ కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ రెడ్డి,జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి,ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ రెడ్డి ,ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి,అధికార ప్రతినిధులు సంధ్యారెడ్డి, అయోధ్య రెడ్డి, లింగం యాదవ్, వచన్ కుమార్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గోన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మొక్కలు చనిపోతున్నాయని చర్యలు తీసుకుంటున్న కలెక్టర్లు చిన్న పిల్లలను ఇబ్బంది పెడుతుంటే ఏం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, సర్పంచులు 15 రోజుల పాటు పిల్లలను ఇబ్బంది పెట్టి కేటీఆర్ అనే పదం వచ్చే విధంగా కింద కూర్చోబెట్టి ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువగా చదువుతారు. చొప్పదండిలో చిన్న పిల్లలను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ ను కలిశాము. నేషనల్ చిల్డ్రన్స్ కమీషన్ కు సైతం లేఖ రాస్తామని వెల్లడించారు.



## పాలమూరు వారసులకు లైన్ క్లియర్

**జయభేరి, మహబూబ్ నగర్ :**

తెలంగాణలో ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. కొన్ని రాజకీయ పార్టీల్లో పెద్ద నేతలు తమ స్థానాలను పదిలంచేసుకున్నారు. మరికొంత మంది తమతో పాటు తమ వారసులను బరిలో దించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కాషాయపార్టీలో ఒకే జిల్లాకు చెందిన నేతలు.. ఎత్తుకు పైఎత్తు వేస్తూ తమ సీట్లతో పాటు తమ వారసుల సీట్లను కన్ఫర్మ్ చేసుకోవడానికి తెగ తాపత్రాయపడుతున్నారు. ఇంతకీ ఎవరా ఇద్దరు నేతలు ? కమలం పార్టీ వారసత్వ రాజకీయాలను ఎంకరేజ్ చేస్తుందా.. ఉమ్మడి పాలమూరు రాజకీయాల్లో ఉనికి చాటుకునేందుకు కుస్తీ పడుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దిగి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ పార్టీలో పట్టు పెంచుకున్నారు. కర్ణాటక ఎన్నికల కో- ఇంఛార్జ్ గా పనిచేశారు. తెలంగాణ బీజేపీ రాజకీయాల్లో కీ రోల్ ప్లే చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే చేరిన మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి... పార్టీలో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు భవిష్యత్ కార్యచరణపై దృష్టిపెట్టారు.ఈ ఇద్దరు నేతల తొలి ప్రాధాన్యత మహబూబ్ నగర్ ఎంపీగా పోటీ చేసి ఢిల్లీ వెళ్లడమే. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేరు వేరుగా ఉండటంతో... బీజేపీ హైకమాండ్ మాత్రం ఎంత పెద్ద నేతలైనా అసెంబ్లీకి పోటీ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఎంపీ టికెట్ విషయంలో ఈ ఇద్దరు పోటీ పడుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఎంపికలోనూ ఈ ఇద్దరి మధ్య పేచీ మొదలైనట్లు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మహబూబ్ నగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని డీకే అరుణ, జితేందర్ రెడ్డి ఇద్దరు నేతలు ప్లాన్ చేసుకుంటున్నారు. డీకే అరుణ సొంత అసెంబ్లీ స్థానంలో తన కూతురు స్నిగ్ధను పోటీలోకి దింపి... తాను మహబూబ్ నగర్ లో పోటీ చేయాలని భావిస్తున్నారట. మరోవైపు మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి అసెంబ్లీకి పోటీచేయాల్సి వస్తే ఖచ్చితంగా మహబూబ్ నగర్ నుంచే పోటీ చేయాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. అంతేకాకుండా తన తనయుడు మిథున్ రెడ్డికి షాద్ నగర్ టికెట్ కన్ఫర్మ్ చేయాలని పార్టీ హైకమాండ్ ను కోరుతున్నారు.మరి ఆ ఇద్దరు నేతల మన్నికను అధిష్టానం మన్నిస్తుందా ? తమతో పాటు వారసులకు ఛాన్స్ ఇస్తుందా ? ఉమ్మడి పాలమూరులో బీజేపీ వ్యూహం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## సిటీలో పెరుగుతున్న కోచ్ రెస్టారెంట్లు

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రస్తుతం థీమ్ బేస్ రెస్టారెంట్లు ట్రెండ్‌గా మారాయి! కస్టమర్లు తమ ఇష్టాలకు తగ్గట్టుగా ఇందులోకి వెళ్లి ఆహారాన్ని ఆస్వాదించవచ్చు. ఉదాహరణకు ట్రైన్ రెస్టారెంట్లు పిల్లలను ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయి. రోబో రెస్టారెంట్లలో రోబోలే వడ్డిస్తాయి. వీటిని ఆదర్శంగా తీసుకున్నారో ఏమో! దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాచీగూడ రైల్వే స్టేషన్లో రైల్వే కోచ్ రెస్టారెంటును ఏర్పాటు చేశారు. దీని పేరు పరివార్ ఫుడ్ ఎక్స్‌ప్రెస్! అంటే రెస్టారెంట్ ఆన్ వీల్స్ అన్నమాట!!నార్త్ ఇండియన్, సౌతిండియన్, మొఘలాయి, చైనీస్ వంటి రుచికరమైన ఆహార పదార్థాలను పరివార్ ఫుడ్ ఎక్స్‌ప్రెస్‌లో అందిస్తున్నారు. కాచీగూడ రైల్వేస్టేషన్ నిత్యం ప్రయాణికులతో అలరారుతుంది. ఎంతో మంది రైలు దిగగానే తినడానికి ప్రయత్నిస్తారు. దాంతో సర్క్యులేటింగ్ ఏరియాలో హైదరాబాద్ డివిజన్లో మొదటి రెస్టారెంట్ ఆన్ వీల్స్‌ను అధికారులు ఆరంభించారు. రెండు పాత హెరిటేజ్ కోచులను ఇందుకు ఉపయోగించుకున్నారు. వాటిని పునరుద్ధరించి, నగిషీలు అద్ది అత్యంత రాజసంగా మార్చేశారు. ప్రయాణికులతో పాటు సాధారణ ప్రజలూ ఇక్కడ ఫుడ్‌ను ఆస్వాదించొచ్చు.రైలు పట్టాలపై అమర్చిన కోచుల్లో డైనింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయడం వల్ల కస్టమర్లకు ప్రత్యేక డైనింగ్ అనుభూతి వస్తుందని అధికారులు అంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రత్యేకమైన ఆహార క్షేత్రంగా ఉంటుందని సూచిస్తున్నారు. త్వరలోనే మరిన్ని సౌకర్యాలు నెలకొల్పుతామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ అన్నారు. మంచి ఐడియాతో రెస్టారెంటును నిర్మించిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. 24 గంటలు ప్రయాణికులు, కస్టమర్లకు నాణ్యతతో కూడిన ఆహారం, పానీయాలను అందిస్తున్నామని వెల్లడించారు.

## కేంద్రంపై అవిశ్వాసం


**జయభేరి, న్యూఢిల్లీ :**

మణిపూర్ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష కూటమి ఇండియా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భావసారూప్యత కలిగిన ప్రతిపక్షాల నేతల పార్లమెంట్ సమావేశాలకు ముందు భేటీ అయ్యారు. మణిపూర్‌పై ప్రధాని ప్రకటన చేయాలని ఉభయ సభల్లో డిమాండ్ చేస్తూనే ఉండాలని నిర్ణయించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరుగుతున్న టైంలోనే భావసారూప్యత కలిగిన ప్రతిపక్షాలు రాజ్యసభలో ప్రతిపక్ష నేత గదిలో సమావేశమయ్యారు. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఇద్దరు అమ్మాయిల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. అయితే ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో మణిపూర్ అల్లర్ల అంశమే కీలకంగా మారింది. దీనిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని ఎంపీలు పట్టుబట్టడంతో ఉభయసభల్లో గందరగోళ వాతావరణం నెలకొంది. మంగళవారం ఉదయం 11.00 గంటలకు ప్రారంభమైన లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా కొన్ని నిమిషాల్లోనే వాయిదా వేశారు అయితే మణిపూర్ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు పాటుపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మోదీ సర్కార్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఛాంబర్‌లో జరిగిన విపక్ష నేతల సమావేశంలో... కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా మణిపూర్ అల్లర్లతో సహా అనేక కీలకమైన అంశాలపై చర్చించే అవకాశం ఉంటుందని విపక్షాల ఆలోచనగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ప్రధాని మణిపూర్‌పై ప్రకటన చేయాలంటూ విపక్షాలు పట్టుబడటంతో వారు వెనక్కి తగ్గుతారని కేంద్రం భావించడం లేదు. దీంతో ఇక బిల్లలు ప్రవేశపెట్టడంపైనే దృష్టి పెడుతున్నట్లు సమాచారం

# 16 80 రోజుల నుంచి ఇంటర్నెట్ బంద్

**జయభేరి, ఇంపాల్ :**

హింసాత్మక ఘటనలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అట్టుడికిపోతోంది. రోజుకో దారుణమైన ఘటనతో వార్తల్లో నిలుస్తోంది. కొన్ని రోజుల క్రితం ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడటం, స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను సజీవ దహనం చేయడం లాంటి ఘటనలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో చెలరేగిన ఈ హింసను కట్టడి చేయడంలో భాగంగా మణిపూర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. గత 80 రోజుల నుంచి మణిపూర్ లో అంతర్జాల సేవలు లేవు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో ఇంటర్నెట్ లేకపోవడం అంటే.. ప్రపంచంలో, మన దేశంలో, రాష్ట్రంలో ఏం జరుగుతుందో కూడా తెలుసుకోలేని పరిస్థితి. అలాంటిది దాదాపు 3 నెలలుగా ఇంటర్నెట్ సేవలు లేకపోవడంతో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు అక్కడి ప్రజలు.ప్రస్తుతం మణిపూర్ లో పాఠశాలలు, విద్యా సంస్థలు కూడా తెరచుకోకపోవడంతో చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ చదువులకు విద్యార్థులంతా అలవాటు పడిపోయారు. కానీ అంతర్జాలం లేకపోవడంతో క్లాసులు వినలేని పరిస్థితి నెలకొంది. ఇంటర్నెట్ లేకపోవడంతో రోజువారీ జీవితంపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అంతర్జాలం లేకపోవడంతో ఆన్‌లైన్ లావాదేవీలు కూడా చేసుకోలేని పరిస్థితి. పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా యూపీఐ సేవలు గ్రామాల్లోకి కూడా విస్తరించాయి. ప్రస్తుతం ఇంటర్నెట్ లేకపోవడంతో ఈలావాదేవీలు చేసుకోలేని పరిస్థితి. అలాగే ఏటీఎంలు, బ్యాంకింగ్ సేవలకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. 22,327 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం. 30 లక్షల మంది జనాభా. మూడు తెగల ప్రజలు. ఇదీ క్లుప్తంగా మణిపూర్. మణిపూర్ అంటే బంగారు భూమి అని అర్థం. ముత్యాల నేల అని కూడా అంటారు. అంత అందమైందీ ప్రాంతం. ఈ రాష్ట్రంలో మొత్తం 39 తెగలున్నాయి. వీరిలో హిందువులు,




ముస్లింలు, క్రిస్టియన్లు ఉన్నారు. ఇన్ని తెగలున్నప్పటికీ మెజార్టీ మాత్రం మైతేయి వర్గానిదే. 50%కిపైగా ఈ తెగ వాళ్లే ఉన్నారు. 43% మంది కుకీలు, నాగాలున్నారు. మైతేయిని మెజార్టీ కమ్యూనిటీ కాగా..కుకీలు, నాగాలు మైనార్టీలు. ఇప్పుడు గొడవ జరుగుతోంది మైతేయి, కుకీల మధ్య. మైతేయిలకు షెడ్యూల్ తెగ హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర హైకోర్టు ఎప్పుడైతే ప్రభుత్వానికి సూచించిందో అప్పటి నుంచి నిప్పు రాజుకుంది. అది క్రమంగా రాష్ట్రాన్ని మంటల్లోకి నెట్టేసింది.ఇప్పుడు ST హోదా అనేది కేవలం ఓ కారణమే అయినా...మైతేయిలకు, కుకీలకు ఎప్పటి నుంచో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మైతేయి తెగ అధీనంలోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని కుకీలు చాలా గట్టిగా నమ్ముతున్నారు.
ఇందులో నిజానిజాలెంత అన్నది పక్కన పెడితే వాళ్లలో ఈ ఆలోచన బలంగా నాటుకుపోయింది. తమపై వివక్ష చూపిస్తున్నారని మండిపడుతున్నారు కుకీలు. "మా భూములు బలవంతంగా లాక్కుంటున్నారు. మమ్మల్ని రాష్ట్రం నుంచి వెళ్లగొడుతున్నారు" అని పలు సందర్భాల్లో కుకీలు ఆందోళన వ్యక్తం చేశారు. కొండ ప్రాంతంలో కుకీలదే మెజార్టీ. మైతేయిలకు ST హోదా వస్తే ఈ కొండ ప్రాంతాల్లోని భూములనూ కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. అంటే తమ "ఉనికి"కోల్పోతామని కుకీలకు భయం పట్టుకుంది. ఈ భయం నుంచే ఘర్షణ మొదలైంది.

# ఆగస్టు నెలలో 14 రోజుల సెలవులు




**జయభేరి, ముంబై :**

ఆగస్టు 2023లో ఆదివారం, రెండవ, నాల్గవ శనివారంతో సహా 14 రోజుల పాటు బ్యాంకులు మూసివేయబడతాయి. రాష్ట్ర నిర్దిష్ట బ్యాంకు సెలవులతో పాటు. దేశంలోని అన్ని బ్యాంకులు మూసివేయబడినప్పుడు ఇతర సెలవులు ఉన్నాయి. జాప్యాన్ని నివారించడానికి మీ బ్యాంక్ సంబంధిత పనులన్నింటినీ షెడ్యూల్ చేయడం చాలా ముఖ్యం. టెండాంగ్ లో రమ్ ఫట్, స్వాతంత్ర్యం, పార్సీ నూతన సంవత్సరం (షహన్‌షాహి), శ్రీమంత శంకరదేవ తేదీ, మొదటి ఓనం, తిరువోణం, రక్షా బంధన్, రక్షా బంధన్/శ్రీ నారాయణ గురు జయంతి/పాంగ్‌లాబ్సోల్ వంటి రాష్ట్రాలవారీ సెలవులు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెలవు షెడ్యూల్ ప్రకారం, వివిధ రాష్ట్రాల్లోని అన్ని వాణిజ్య, ప్రభుత్వ రంగ బ్యాంకులు తరువాతి రోజుల్లో 14 రోజుల పాటు మూసివేయబడతాయి. అలాగే ఆగస్టు నెలలో మొత్తం 14 రోజుల పాటు బ్యాంకులు మూత పడనున్నాయి. అయితే వినియోగదారులు ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏంటంటే ఈ సెలవులు అన్ని రాష్ట్రాల బ్యాంకులకు వర్తించవన్న సంగతిని గుర్తించుకోవాలి..


**ఏయే రోజుల్లో బ్యాంకులకు సెలవు అంటే..**

ఆగస్టు 6 (ఆదివారం): దేశంలో ఆదివారం బ్యాంకులు మూసివేయబడతాయి. (సాధారణం అన్ని బ్యాంకులకు ఉండే హాలిడే). ఆగస్ట్ 8 (మంగళవారం): టెండాంగ్ లో రమ్ ఫాట్ సిక్కింలో మాత్రమే బ్యాంకులు మూసివేయబడ్డాయి. ఆగస్టు 12 (శనివారం): దేశంలో రెండో శనివారం బ్యాంకులకు సెలవు. ఆగస్టు 13 (ఆదివారం): దేశంలో ఆదివారం బ్యాంకులు మూసి ఉంటాయి. ఆగస్ట్ 15 (మంగళవారం): స్వాతంత్ర్య దినోత్సవం రోజున దేశంలో బ్యాంకులు పని చేస్తాయి. ఆగస్టు 16 (బుధవారం): పార్సీ నూతన సంవత్సరం (షాహెన్‌షాహి) - మహారాష్ట్రలో మాత్రమే బ్యాంకులు మూతపడ్డాయి. ఆగస్టు 18 (శుక్రవారం): శ్రీమంత్ శంకర్‌దేవ్ తేదీ అస్సాంలో బ్యాంకులు మూసివేయబడ్డాయి. ఆగస్టు 20 (ఆదివారం): దేశంలో ఆదివారం బ్యాంకులు మూసి ఉంటాయి. ఆగస్టు 26 (శనివారం): దేశంలో నాలుగో శనివారం బ్యాంకులు మూతపడతాయి. ఆగస్టు 27 (ఆదివారం): దేశంలో ఆదివారం బ్యాంకులు మూసి ఉంటాయి. ఆగస్టు 28 (సోమవారం): మొదటి ఓనం - కేరళలో బ్యాంకులు మూసివేయబడ్డాయి. ఆగస్టు 29 (మంగళవారం): తిరువోణం - కేరళలో బ్యాంకులు మూతపడ్డాయి. ఆగస్టు 30 (బుధవారం): రక్షా బంధన్ రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బ్యాంకులు మూసివుంటాయి. ఆగస్ట్ 31 (గురువారం): రక్షా బంధన్/శ్రీ నారాయణ గురు జయంతి/పాంగ్‌లాబ్సోల్ ఉత్తరాఖండ్, అస్సాం, కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో బ్యాంకులు మూసివేయబడ్డాయి. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం ప్రకారం RBI ద్వారా బ్యాంకు సెలవులు, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ కింద సెలవులు, రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సెలవులు, బ్యాంకు ఖాతాల మూసివేత వర్గీకరించబడింది. ఈ సమయంలో, ఆర్థిక, ఆర్థికేతర సహా చాలా బ్యాంకింగ్ లావాదేవీలు నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ లేదా వాట్సాప్ బ్యాంకింగ్ ద్వారా చేయవచ్చు.

# వారానికి 3 రోజులు ఆఫీసుకు రండి

**జయభేరి, హైదరాబాద్ :**

ఉద్యోగులు వారంలో కనీసం మూడు రోజులైనా ఆఫీసులకు రావాలని ఐటీ కంపెనీలు కోరుతున్నాయి. ఇండస్ట్రీ కష్టాల్లో ఉండటం, లాభదాయకత తగ్గడం, అట్రిషన్ రేటు పెరగడం, నియామకాలు తగ్గడమే ఇందుకు కారణాలు! ఆఫీసులకు రావడం వల్ల సహోద్యోగులు, యాజమాన్యంతో అనుబంధం పెరుగుతుందని కంపెనీలు చెబుతున్నాయి.తమ ఉద్యోగుల్లో సగం మంది వారంలో కనీసం రెండు రోజులు ఆఫీసులకు వస్తున్నారని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, విప్రో, పర్సిస్టెంట్ సిస్టమ్స్ వంటి కంపెనీలు చెబుతున్నాయి. కరోనా రావడంతో అందరి కన్నా ముందుగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను అందిపుచ్చుకున్నది ఐటీ ఇండస్ట్రీయే! దేశ విదేశాల్లో అన్ని కంపెనీలు డిజిటలైజేషన్ బాట పట్టడంతో వారికి డిమాండ్ పెరిగింది. ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసి క్లెయింట్లకు అప్పగించాలని, కార్యాలయాలకు అద్దె, రవాణా, ఇతర ఖర్చులు మిగలడంతో వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎక్కువగా ఎంకరేజ్ చేశారు. మహమ్మారి బాధ తప్పినా చాలా మంది ఆఫీసులకు రావడానికి ఇష్టపడటం లేదు.గతేడాది సెప్టెంబర్ నుంచి టీసీఎస్‌లో ఉద్యోగులు ఆఫీసులకు రావడం మొదలు పెట్టారు. 'మా ఉద్యోగులు ఆఫీసులకు రావడం వేగవంతమైంది. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 55 శాతం మంది వారంలో కనీసం మూడు రోజులు పంచ్ కొడుతున్నారు' అని టీసీఎస్ చీఫ్ హెచ్‌ఆర్ మిలింద్ లక్కడ్ అన్నారు.



ఈ ఏడాది చివరి వరకు 7075 శాతం మంది ఆఫీసులకు వస్తారని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయ్ కుమార్ అంచనా వేస్తున్నారు. వారంలో తమకు నచ్చిన మూడు రోజుల్లో ఆఫీసుకు వచ్చేలా విప్రో ప్రోత్సహిస్తోంది. 'మా ఉద్యోగుల్లో కనీసం 55 శాతం మంది వారంలో మూడు రోజులు ఆఫీసుకు వస్తున్నారు' అని ఆ కంపెనీ ప్రతినిధి తెలిపారు.ఆఫీసులకు రావాలని చెప్పడంతో మహిళా ఉద్యోగుల్లో అట్రిషన్ రేటు పెరిగిందని టీసీఎస్ తెలిపింది. అయితే కచ్చితమైన రేటు వెల్లడించలేదు. కరోనా సమయంలో మహిళలు ఇంటికి అలవాటు పడటం, మరికొన్ని మార్పులు రావడం ఉద్యోగాలు మానేయడానికి కారణాలని లక్కడ్ పేర్కొన్నారు. గతేడాది 17.4 శాతంగా ఉన్న అట్రిషన్ రేటు ఈసారి 20.1 శాతానికి పెరిగిందని వెల్లడించారు. మొత్తం 614,795 మంది ఉద్యోగుల్లో 35.7 శాతం మంది మహిళలే ఉన్నారని వివరించారు. తమ ఉద్యోగుల్లో కనీసం 3040 శాతం మంది ఆఫీసులకు వస్తున్నారని ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సీఈవో దేబాశీష్ ఛటర్జీ తెలిపారు. నగరాన్ని బట్టి కొంత తేడా ఉందన్నారు. ఆఫీసులకు వచ్చి పనిచేయడంలో ఫ్లెక్సిబిలిటీ ఇస్తున్నామని పేర్కొన్నారు. క్లెయింట్లను బట్టి ఫ్లెక్లిబిలిటీ ఉంటుందన్నారు. 'భారత్‌లో మాకు 20,000 వరకు ఉద్యోగులు ఉన్నారు. అందులో 11,000కు పైగా వారం ప్రాతిపదికన ఆఫీసుకు వస్తున్నారు' అని పర్సిస్టెంట్ సిస్టమ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ కర్లా అన్నారు. కంఫర్ట్ జోన్ వదిలి వచ్చేందుకు కొందరు ఇష్టపడటం లేదని, ఆశావహ దృక్పథంతో వారికి నచ్చజెపుతున్నామని పేర్కొన్నారు.

# మార్కెట్ లో చింతపండు పైపైకి

**జయభేరి, హైదరాబాద్ :**

సామాన్యులకు టమాటా, పచ్చి మిర్చి తర్వాత ఇప్పుడు చింతపండు షాకిస్తోంది. మార్కెట్ లో చింతపండు ధరలు భారీగా పెరిగాయి. టమాటా ధర కొండెక్కి కూర్చోవటంతో సామాన్యులు ప్రత్యామ్నాయంగా చింతపండును ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ఇప్పుడు చింతపండు ధర కూడా చెట్టెక్కేస్తుంది. కిలో 120 రూపాయలు ఉన్న చింతపండు ధర అమాంతంగా పెరిగిపోయింది. ఇప్పుడు ఒక్కసారిగా రూ.170కి పెరిగింది. టమోటో ధర రూ.150. దాటుతుండడంతో చింతపండు వాడేందుకు వినియోగదారులు సిద్ధంగా ఉండడమే ధర పెరగడానికి కారణం అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. పేద, మధ్యతరగతి ప్రజలు టమాటా కొనేందుకు ఇష్టపడక చింతపండును వినియోగిస్తున్నారు.గత నెలతో పోలిస్తే చింతపండు కిలోకు రూ.4050



పెరిగింది. ప్రస్తుతం కిలో చింతపండుకు బదులు అర కేజీకి కొనుగోలు చేస్తున్నారు. చింతపండు ధరల పెరుగుదలకు టమోటా పెరుగుదలకు సంబంధం లేదు. ప్రతి సంవత్సరం చింతపండు దిగుబడి వస్తే కిలో 100 రూపాయలు వరకు పెరుగుతోంది. ఇప్పుడు కొత్త చింతపండు వచ్చే వరకు కాస్త పెంపు తప్పదని వ్యాపారులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా పెరిగిన టమాటా ధరలతో వింత వింత సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. టమాటా చోరీలు, తోటలో పడి పంటను ఎత్తుకెళ్తున్న దొంగలు వంటి వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇంకా కొన్ని చోట్ల టమాటాపై కొన్ని రకాల ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నారు. మరికొన్ని చోట్ల టమాటా బండ్లకు పోలీసులతో సెక్యూరిటీ ఏర్పాటు చేస్తున్నారు. ఇలా టమాటాపై సోషల్ మీడియాలో మీమ్స్ కూడా విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి.

# కొడుకును చంపి... భార్యభర్తల ఆత్మహత్య

**జయభేరి, హైదరాబాద్ :**

మురళీధరన్ శైలజ దంపతులు.. ఈ అన్యోన్య దంపతులకు ఏకైక సంతానం జీవా.. జీవా వయస్సు ఏడేళ్లు.. కొడుకు భవిష్యత్తు కోసం ఎన్నో ఆలోచనలు పెట్టుకున్నారు.. ఐటి ఉద్యోగం చేస్తున్న మురళీధరన్ కుటుంభం ఆర్థికంగా కూడా బాగానే ఉంది. కన్యాకుమారిలోని ప్రైమ్ ఏరియాలో నూతన భవనం కూడా కట్టుకున్నారు మురళీధరన్ శైలజ.. మూడు నెలల క్రితమే గృహ ప్రవేశం కూడా జరిగింది. అంతా బాగానే ఉన్నా.. లోకం పోకడ కూడా తెలియని వయస్సులో ఉన్న కొడుకుని తల్లిదండ్రులే హత్య చేశారు.. రాత్రి పడుకునే ముందు నిద్రమాత్రలు పాలలో కలిపి తాగించారు.. ఆతర్వాత దిండుతో మొహంపై ఆదిమి పెట్టి ఊపిరి అడకుండా చేసి హత్యచేశారు. ఆతర్వాత అదే ఇంట్లో శైలజ, మురళీధరన్ దంపతులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చూడముచ్చటగా ఉన్న ఆ చిన్న పిల్లాడిని చంపడానికి బయటవారికే చేతులు రావు.. అలాంటిది తల్లిదండ్రులు వారి చేతులతో ఎలా చంపగలిగారు అంటూ విషయం తెలిసిన వారందరూ బాధ పడ్డారు. విషయం తెలిశాక పోలీసులు అక్కడకు చేరుకున్నారు.. విచారణ ప్రారంభించిన పోలీసులకు షాకింగ్ విషయం బయటపడింది.మురళీధరన్ కొడుకు జీవాకి అనారోగ్య సమస్య ఉందన్న విషయం బయటపడింది. పరిష్కారం కోసం చాలామంది వైద్యులను కలిశారు తల్లిదండ్రులు.. వైద్యులు కొడుకు మానసిక పరిస్థితి జీవితాంతం ఇలాగే ఉంటుందని చెప్పడంతో తల్లితండ్రులు తీసుకున్న కఠిన నిర్ణయం.. తమ తర్వాత కొడుకు పరిస్థితిని ఊహించుకుని కొడుకును హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలింది.. కొత్తగా కట్టుకున్న ఆశల సౌధం.. ఎన్నో ఆశలు పెట్టుకున్న కొడుకు భవిష్యత్తు.. కొడుకుతో ఊహించుకున్న దంపతుల జీవితం.. అన్నీ ఒక్క నిర్ణయం తో ఇలా విషాదంగా మిగిలింది.

# ఎన్నికలప్పుడే కేసీఆర్ కు బంధులు గుర్తుకువస్తాయి

**జయభేరి, నల్గొండ :**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి న్యూవివేర లో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఎంపి మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉన్న నార్కట్ పల్లి ఆర్టీసీ డిపోను ఎత్తివేయ్యవద్దని ఆర్టీసీ ఎండీ సర్జనార్ ని కోరినా. డిపో స్థలంలో ఎలాంటి కాంప్లెక్స్, మాల్ ని నిర్మించొద్దని ఎండిని కోరానని అన్నారు.
తెలంగాణ లో రైతులు మూడు పంటలతో సంతోషంగా ఉన్నారని సీఎం కేసీఆర్ అన్నారు. అలాంటప్పుడు మూడు సార్లు రైతుబంధు ఎందుకు ఇవడం లేదో సీఎం చెప్పాలి. ఇప్పటికే చాలా మందికి 5 ఎకరాలు ఉన్న రైతులకు డబ్బులు ఇవ్వలేదు. 24 గంటల కరెంట్ పై నేను లాగ్ బుక్ ద్వారా నిజానిజలు తేల్చకే.. కొన్ని చోట్ల 24 గంటల కరెంట్ ఇచ్చిరు. నేరుగా రైతుల వద్దకు వెళ్లి.. కరెంట్ ఎలా ఇస్తున్నారో ప్రజలకు తెలిసేలా చేస్తాం. కరెంట్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు కరెంట్ షాక్ తో చనిపోతున్న పట్టించుకున్న పాపాన సీఎం కేసీఆర్ పోలె. సీఎం కేసీఆర్ కి ఎన్నికలు వచ్చినప్పుడే ఆ బందు ఈ బందు గుర్తుకు వస్తాయి. ఇప్పటివరకు ఎంత మందికి దళిత బంధు ఇచ్చారో ఎవరెవరికి ఇచ్చారో అని అన్నారు.
రాష్టంలో నెక్స్ట రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే. కుంభం అనిల్ పై మాట్లాడడానికి అయన సుముఖత చూపలేదు

# మైహోం పరిశ్రమలో ప్రమాదం

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు లోని మైహోం సిమెంట్ పరిశ్రమలలో భారీ ప్రమాదం సంభవించింది. ప్లాంట్ ఎగువ భాగంలో స్లాబ్ వేస్తుండగా.. కార్మికులపై స్లాబ్ కూలింది. దాదాపు 600 ఫీట్లు ఎత్తు నుంచి ఆరుగురు కార్మికులు కిందపడిపోయారు. ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మూడు మృతదేహాలను వెలికితీసారు. క్షతగాత్రులు ఉత్తరప్రదేశ్, బీహార్ కు చెందిన వారుగా గుర్తించారు. మైహోమ్ యాజమాన్యం ప్రమాదంపై గోప్యత పాటిస్తోంది. మరోవైపు మృతుల సంఖ్య పెరిగే అవకాశం వున్నట్లు సమాచారం..

# 26న ఇంటర్ ఎస్.సి. సీట్లకు స్పాట్ అడ్మిషన్

**జయభేరి, పెద్దపల్లి :**

26న ఇంటర్ మొదటి సంవత్సరం ఎస్.సి. కేటగిరిలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు, అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికేట్ లతో హాజరు కావాలని టి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ. ఐ.ఎస్. జిల్లా సమన్వయాధికారి ఎం. మంజుల సోమవారం తెలిపారు. కరీంనగర్ రీజియన్ లోని, పెద్దపల్లి జిల్లాలోని మల్లాపూర్, గర్రెపల్లి, మంథని, రామగుండం , నంది మేడారం, పెద్దపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 20232024 విద్యా సంవత్సరమునకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరములో ఎస్.సి. కేటగిరిలో మిగిలి ఉన్న ఖాళీల భర్తీ కొరకు జూలై 26న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్ కొరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
సుల్తానాబాద్ మండలం గర్రేపల్లిలోని టి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్. కళాశాలలో నిర్వహించు కౌన్సెలింగ్ లో మార్చి, జూన్ 2023 మాసంలో పదవ తరగతి పాస్ అయిన బాల, బాలికలు తమ ఒరిజినల్ సర్టిఫికేట్ లతో కౌన్సెలింగ్ కు హాజరు కావాలని ఎం. మంజుల తెలిపారు.



# నిరుపేదలందరికీ ఇండ్లు ఇస్తానంటూ మోసం చేశారు

**జయభేరి, పెద్దపల్లి :**

రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తానంటూ డబల్ బెడ్రూమ్ పథకాన్ని ఎన్నికల హామీగా రాష్ట్రంలో ఒక్క పెంకుటిల్లు కూడా లేకుండా చేస్తామని రూ.20వేల కోట్లతో మూడు లక్షల పైగా ఇండ్లు నిర్మిస్తున్నామని ప్రకటించారన్నారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు కటకం మృత్యుంజయం అన్నారు. జిల్లా కేంద్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్ రెడ్డి పిలుపు మేరకు ఇల్లు లేని ప్రతి పేదోడికి డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని ఇచ్చిన పిలుపుమేరకు అంబేద్కర్ స్తూపం వద్ద గల ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు కటకం మృత్యుంజయ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2016లో రాష్ట్రానికి 2.91 లక్షల ఇండ్లు కేటాయించి, రూ.1311.49 కోట్లు ఇవ్వడమే కాకుండా రూ. 8624.76 కోట్ల రుణాన్ని కూడా సమకూర్చింది. అయినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 20వేల ఇండ్లు కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో పలు చోట్ల ఇండ్ల నిర్మాణం స్తంభించిపోయిందని లక్ష రూపాయలు ముట్ట చెప్పిన వారికే ఇండ్లు ఇస్తున్నారని స్వయంగా బిఆర్ఎస్ నాయకులే ప్రెస్ మీట్ లు పెట్టి మరీ ఆరోపిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇంటి జాగా ఉన్నవారికి రూ.5 లక్షలు ఇస్తానన్న మాట మార్చి ఆర్థిక సహాయాన్ని రూ.3 లక్షలకు పరిమితం చేస్తూ 'గృహలక్ష్మి' పేరుతో కొత్త పథకాన్ని ప్రకటించారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వని కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు కమలం జెండా ఎత్తి పోరుబాటన సాగుదాం అన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్, పదేళ్ల కేసీఆర్ పాలనలో మనం మోసపోతూనే ఉన్నామని, ఈ అవినీతి, కుటుంబ పార్టీల భరతం పట్టేందుకు బిజెపి జెండా ఎత్తి ఇండ్లు ఇచ్చేవరకు నడుం బిగించి సాధించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారాపు పర్వతాలు , వడ్డేపల్లి రామచంద్రం, గొట్టిముక్కల సురేష్ రెడ్డి మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్ జిల్లా ఇంచార్జ్ రావుల రామనాథ్ పెద్దపల్లి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ తంగెడ రాజేశ్వరరావు పోల్సాని సంపత్ రావు కన్వీనర్లు పిడుగు కృష్ణ నాంపల్లి రమేష్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రాజం మాహంత కృష్ణ మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ కూకట్ల నాగరాజు శ్రీనివాస్ కోదాడ రామన్ రావు సంపత్ రాజన్న పటేల్ ఒళ్లే తిరుపతి బూడిద తిరుపతి ఎర్రోళ్ల శ్రీకాంత్ ఉషణ అన్వేష్ శివ రాహుల్ రాకేష్ ముంజ రాజేంద్రప్రసాద్ సాయి చరణ్ అంజి జయశంకర్ అధిక సంఖ్యలో లబ్ధిదారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

jayabheridaily.com
ప్రభాత
జయభేరి

## మంత్రి కేటీఆర్ మానిప్యులేటర్

**జయభేరి, హైదరాబాద్ :**

టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి మంత్రి కేటీఆర్ పై ట్వీట్టర్ వేదికగా ఆరోపణలు గుప్పించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ మానిప్యులేటర్ అంటూ మంత్రి కేటీఆర్ పై రేవంత్ రెడ్డి అంటూ ట్వీట్ చేసారు. టీఎస్ఐపాస్ కింద ప్రభుత్వం తప్పుడు సమాచారం అందించిందని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అన్నది. లేని ఉద్యోగాలు ఇచ్చినట్లు చూపిస్తున్నట్లు ఆర్టీఐ ద్వారా బుజువైందని పద్మనాభరెడ్డి ప్రకటించారు.
ఒక దినపత్రిక కథనాన్ని జత చేస్తూ రేవంత్ ట్వీట్ చేసారు. డ్రామారావు మరో డ్రామాను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలంటూ ట్వీట్ లో పేర్కొన్నారు.

## సముద్రంలో పడవ బోల్తా..ఒకరు మృతి

**జయభేరి, శ్రీకాకుళం :**

సముద్రంలో వేటకు వెళ్లిన పడవ బోల్తా పడటంతో ఒకరు మృతిచెందారు. సోంపేట మండలం ఇసకలపాలెం గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. మంగళవారం వేకువజామున 4 గంటలకు ఇసకలపాలేనికి చెందిన ఐదుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. పడవ బోల్తా పడటంతో గంట జనార్ధన (40) సముద్రంలో పడి మృతిచెందగా.. బైపల్లి తులసయ్య గల్లంతయ్యారు. మరో ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. జనార్ధనను కాపాడేందుకు తోటి మత్స్యకారులు విఫలయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గల్లంతైన తులసయ్య కూడా సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. ఆయన మరో పడవను ఆశ్రయించి ఒడ్డుకు చేరినట్లు తెలుస్తోంది. గంట జనార్ధన మృతితో ఆయన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## వాగులో మునిగి ఇద్దరు బాలికలు మృతి

**జయభేరి, మహబూబ్ నగర్ :**

మహబూబ్ నగర్ జిల్లాలో వాగు దాటుతూ ఇద్దరు బాలికలు మృతి చెందారు. జడ్చర్ల మండలం..కొండెడు చెందిన స్వాతి(18), అనూష(17) మృతి చెందారు. పొలంలో కలుపు తీయడానికి వెళ్తూ తూర్పు వాగులో గల్లంతుఅయ్యారు. అర కిలోమీటర్ దాటిన తర్వాత వాగులో ఇద్దరి మృతదేహాలు లభ్యం అయ్యాయి. మృతులు పక్కపక్క ఇళ్లల్లో నివాసముంటున్నారు

## సుప్రీంను ఆశ్రయిస్తా

**జయభేరి, హైదరాబాద్ :**

తన ఎమ్మెల్యేసభ్యత్వం పై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్ట్ లో వనమా సవాలు చేయనున్నారు. జన బలంతో, మెజారిటీ ఓట్లతో గెలిచిన వారు ఎమ్మెల్యే., ప్రజా క్షేత్రంలో గెలవాలి తప్ప, దొంగ కేసులతో, ఒడిన దగ్గర నుంచి, ప్రజల కష్ట సుఖాలు పట్టించుకోకుండా, హైదరాబాద్ కోర్ట్ ల చుట్టూ తిరిగే వారు ఎప్పటికి ఎమ్మెల్యే కాలేరు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుంది, సుప్రీంకోర్టును సంప్రదిస్తా. రెండు రోజుల్లో స్టే వస్తుంది.ఎవ్వరు అధైర్య పడవద్దని అయన అన్నారు

## వరద ప్రాంతాలను పరిశీలించిన మంత్రి వేముల

**జయభేరి, వేల్పూర్ :**

వేల్పూర్ మండలంలో సోమవారం రాత్రి కురుసిన అతి భారీ వర్షం వల్ల (సుమారు 46 CM) చెరువులు,వాగులు వంకలు అన్ని నిండి అద్భుతంగా ప్రవహిస్తూ ఉండటం జానకం పెట్,పచ్చల నడ్కూడ,వేల్పూర్,పడగల్ చెరువులు తెగటం,రోడ్లు కోతకు గురి కావడంతో ఈ రోజు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అధికారులతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జయసుధ, ఆర్డీఓ వినోద్,ఇరిగేషన్ అధికారులు,ఆర్.అండ్.బి ఎస్.ఈ,పంచాయతీ రాజ్ డీఈ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## హైకోర్టు సంచలన తీర్పు

**జయభేరి, హైదరాబాద్ :**

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పై రాష్ట్ర హైకోర్టు అనర్హత వేటు వేసింది. అయన ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని కోర్టును జలగం వెంకట్రావు ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ పై సుదీర్ఘంగా విచారణ జరిపిన హైకోర్టు వనమా ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది. ఈసీకి తప్పుడు అఫిడవిట్ ఇచ్చినందుకు ఎన్నిక చెల్లదన్న హైకోర్టు, వనమాకు ఐదు లక్షల జరిమానా విధించింది. 2018 ఎన్నికల్లో సమీప అభ్యర్థిగా ఉన్న జలగం వెంకట్రావును విజేతగా ప్రకటించింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున వనమా గెలిచారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్ లో చేరారు.

## ఏలూరు రేంజ్ పరిధిలో పలువురుసీఐ ల బదిలీలు

**జయభేరి, ఏలూరు :**

ఏలూరు రేంజ్ పరిధిలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఆకివీడు సీఐగా పనిచేస్తున్న ఎం గీతా రామకృష్ణను కాకినాడ జిల్లా తుని సర్కిల్ ఇన్స్పెక్టర్ గా, తుని సర్కిల్ ఇన స్పెక్టర్ గా పనిచేస్తున్న నాగ దుర్గారావు ఏలూరు రేంజ్ విఆర్ కు పంపించారు. ఏలూరు రేంజ్ విఆర్ లో ఉన్న జి శ్రీనివాసును భీమవరం రెండో పట్టణ సిఐగా, భీమవరం రెండో పట్టణ సిఐ గా పనిచేస్తున్న బి కృష్ణ కుమార్ ను కైకలూరు రూరల్ సర్కిల్ సిఐగా బదిలీ చేశారు. ప్రస్తుతం కైకలూరు రూరల్ సిఐగా పనిచేస్తున్న వైవిఎల్ నాయుడును ఏలూరు రేంజ్ విఆర్ కు తరలించారు

## ప్లయాష్ లారీట్యాంకర్ దగ్ధం

**జయభేరి, నందిగామ :**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం ఇబ్రహీంపట్నం విటిపిఎస్ నుండి అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కి వెళ్తున్న ట్యాంకర్ కంచికచర్ల సమీపంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై లారీ లో ఒకసారిగా మంటలు చెల రేగాయి. నిప్పును గమనించిన డ్రైవర్ దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారి పల్లకి సేవ

**జయభేరి, శ్రీశైలం :**

అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాములవారి శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్ల కు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించింది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడుతాయి.

# ఆపరేషన్ ఆకర్ష్ కు గులాబీ వల

**జయభేరి, నల్గొండ :**

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే వివిధ పార్టీల నేతలను పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించింది. అధికార బీఆర్ఎస్ మంత్రి జగదీష్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు వివిధ పార్టీలలో ఉన్న ముఖ్యమైన నాయకులు కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట నల్లగొండ జిల్లాను వరుస ఎన్నికల్లో జయ కేతనం ఎగురవేస్తూ మంత్రి జగదీశ్ రెడ్డి గులాబీ కొండగా మార్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. సాధ్యమైనంత వరకు వివిధ పార్టీలలో మంచి గుర్తింపు ఉన్న నాయకులు, కార్యకర్తలను ఇప్పటికే పార్టీలో చేర్చుకున్నారు. మిగిలిన నేతలు తమ పార్టీకి ప్రయోజన కరంగా ఉంటారు.. అనుకుంటే వెంటనే పావులు కదుపుతూ వారిని పార్టీలలో చేర్చుకుంటున్నారు.ఈ నేపథ్యంలో కర్ణాటక ఎన్నికల ఫలితాలు, భట్టి విక్రమార్క పాదయాత్ర, పొంగులేటి ఖమ్మం సభతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు.. వచ్చే ఎన్నికల్లో 12 స్థానాలకు 12 కాంగ్రెస్ గెలుచు కుంటుందని ప్రతిసారి సవాల్ విసురు తున్నారు. కాంగ్రెస్ దూకుడుకు




అడ్డుకట్ట వేసే వ్యూహంలో భాగంగానే యాదాద్రి జిల్లా డిసిసి అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని బీఆర్ఎస్ లో చేర్చుకున్నారట. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అనిల్ కుమార్ రెడ్డి ఓటమి చవిచూసినప్పటికీ పార్టీని అంటి పెట్టుకున్నారు. అప్పటినుంచి అనిల్ కుమార్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు మంత్రి జగదీష్ రెడ్డితో పాటు కొందరు ఎమ్మెల్యేలు ప్రయత్నం చేస్తూనే ఉన్నారట. ఈ నేపథ్యంలో తాజాగా కుంభం అనిల్ రెడ్డి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై విమర్శలు గుప్పించి సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.రాష్ట్ర కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న దిగ్గజనేతలంతా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే. దక్షిణ తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ముఖ్య నేతల దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో భాగంగానే బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెంచింది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే కాంగ్రెస్ హేమాహేమీలైన జానారెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నేతలను ఓడించి కాంగ్రెస్ ను కంగుతినిపించింది. వచ్చే ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాలను తమ ఖాతాలో వేసుకునేందుకు బీఆర్ఎస్ ఇప్పటి నుంచి పావులు కదుపుతోంది. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలనే లక్ష్యంతో గులాబీ అధినేత కేసిఆర్ ఉన్నట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగానే మరికొందరు కాంగ్రెస్ నేతలను గులాబీ దళంలో కలుపుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్ర నేతలు ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీని ఎన్నికల నాటికి నిర్వీర్యం చేయడం ద్వారా దక్షిణ తెలంగాణపై కాంగ్రెస్ ప్రభావానికి అడ్డుకట్ట వేయవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. ఇందులో భాగంగానే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో పాటు భువనగిరి నియోజకవర్గంలోని ఎంపీపీలు, సర్పంచులకు గులాబీ కండువా కప్పింది.ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మరికొందరు కాంగ్రెస్ నేతలను కూడా బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకునేందుకు మంత్రి జగదీశ్ రెడ్డి పావులు కదుపుతున్నారట. కుంభం అనిల్ కుమార్ రెడ్డి దారిలోనే మరికొందరు కాంగ్రెస్ నేతలు పయనిస్తారని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. ఇప్పటికే నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ దిగ్గజనేతలు గులాబీ కండువా కప్పుకుంటారని పలుమార్లు సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి.ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ వచ్చే సమయం వరకు చేరికల ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతోంది.

## 3 లక్షల 66వేల కోట్ల అప్పులతో తెలంగాణ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శిస్తూనే ఉంటారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనుడు కేసీఆర్ అని సెటైర్లు వేస్తుంటారు. అయితే తెలంగాణ అప్పుల వివరాలను లోక్సభలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లిఖిత పూర్వకంగా తెలిపారు. మార్చి 2023 నాటికి బడ్జెట్ అంచనాల ప్రకారం తెలంగాణ మొత్తం అప్పులు రూ 3,66,306 కోట్లు (3 లక్షల 66 వేల 3 వందల 6 కోట్ల రూపాయలు) ఉన్నట్లు ఆమె తెలిపారు.ఎంపీ నామ నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు లోక్సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లిఖిత పూర్వకంగా ఈ వివరాలు తెలిపారు. 2019 బడ్జెట్ నాటికి తెలంగాణ అప్పుడు రూ 1,90,203 కోట్లు ఉండగా.. 2020కి రూ 225418 కోట్లకు పెరిగింది. 2021 మార్చి నాటికి రూ 271259 కోట్లు, 2022 ఏడాదికి రాష్ట్ర అప్పు రూ 3 లక్షల 14వేల 136 కోట్లు కాగా, 2023 మార్చి బడ్జెట్ సమయానికి తెలంగాణ అప్పుడు రూ.3.66 లక్షల కోట్లకు చేరుకుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. అందులో తాజా అప్పుల వివరాలను పరిశీలిస్తే.. కాళేశ్వరం ప్రాజెక్ట్ కార్పొరేషన్ పేరుతో రూ 6528.95 కోట్లు, హార్టీకల్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పేరిట రూ.526.26 కోట్లు, రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ నిధి నుంచి రూ. 4,263 కోట్లు, క్రెడిట్ ఫెసిలిటీ ఫెడరేషన్స్ నుంచి టీఎస్సీఎస్సీఎల్ రూ. 15,643 కోట్లు ఉంది. వేర్ హౌసింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధి నుంచి రూ. 66.54 కోట్లు, డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్ పేరిట రూ.1407.97 కోట్లు, టిఎస్ మార్క్ ఫెడ్ రూ. 483 కోట్ల అప్పు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రం ప్రభుత్వం లోకసభలో ఏపీ అప్పుల వివరాలు వెల్లడించింది.
బీఆర్ఎస్ ఎంపీ నామ నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి నిర్మలా సీతారామన్ లిఖిత పూర్వకంగా బదులిస్తూ.. ఏపీ మొత్తం అప్పులు 2023 మార్చి నాటికి రూ.4 లక్షల 42 వేల కోట్లు అని స్పష్టం చేశారు. 2019 మార్చి నాటికి ఏపీ అప్పులు రూ2 లక్షల 64 వేల కోట్లు ఉండగా.. 2020 మార్చి నాటికి రూ 3 లక్షల 7వేల 672 కోట్లకు చేరింది. 2021 మార్చిలో రూ 3లక్షల 53 వేల 021 కోట్లు, 2022 మార్చికి రూ 3 లక్షల 93 వేల 718 కోట్ల అప్పు ఏపీ మీద ఉంది. ఇటీవల బడ్జెట్ ప్రవేశపెట్టే మార్చి 2023 నాటికి ఏపీ అప్పుల విలువ 4 లక్షల 42 వేల 442 కోట్లకు చేరిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

**గత కొన్నేళ్ల నుంచి ఏపీ అప్పుల వివరాలు**

2019 మార్చి నాటికి రూ 2.64 లక్షల కోట్లు
2020 మార్చి నాటికి రూ 3.07 లక్షల కోట్లు
2021 మార్చి నాటికి రూ 3.53 లక్షల కోట్లు
2022 మార్చి నాటికి రూ 3.93 లక్షల కోట్లు
2023 మార్చి నాటికి రూ.4.42 లక్షల కోట్లు
ఓవరాల్ గా చూస్తే తెలంగాణ అప్పులు రూ 3.66 లక్షల కోట్లు కాగా, ఏపీ అప్పులు రూ.4.42 లక్షల కోట్లు అని కేంద్రం వెల్లడించింది.

## పాతబస్తీ బీఆర్ఎస్ లో కుమ్ములాటలు..దాడులు

**జయభేరి, హైదరాబాద్ :**

పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నేతల అంతర్గత కుమ్ములాట తారస్థాయికి చేరుకుంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి పై సల్లావుద్దీన్ లోధిపై దాడి మరువక ముందే మరో మారు చార్మినార్ వద్ద దాడి చేయడం తీవ్ర కలకలకం రేపుతుంది. చార్మినార్ సాక్షిగా చార్మినార్ నియోకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి పై సల్లావుద్దీన్ లోధి పై మంగళవారం బహదూర్పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి దాడిచేసి గాయపరచడం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలలోకి వెళితే ... మైనారిటీ బంధు పథకం కింద లక్ష రూపాయాలు ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల మైనార్టీవర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రాష్ట్ర హోంశాఖా మంత్రి మహమూద్ ఆలీ చేతుల మీదుగా మంగళవారం పాలాభిషేకం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర హోంత్రి మహమూద్ ఆలీ కుమారుడు ఆజం అలీ తో పాటు చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి సల్లావుద్దీన్ లోధి తనకార్యకర్తలతో పాటు బహదూర్పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి ఇనాయల్ ఆలీ బాక్రీ తన అనుచరులతో పెద్ద ఎత్తున చార్మినార్ వద్దకు చేరుకున్నారు. కేసీఆర్ చిత్ర పటానికి ఒక వైపు ఇనాయత్ ఆలీ బాక్రీ వర్గం ఉండగా మరో వైపు సల్లాఉద్దీన్ లోధి వర్గం నిలబడింది. హోంమంత్రి కుమారుడు ఆజం కూడా అక్కడే ఉన్నాడు. కాసేపట్లో హోంమంత్రి మహమూద్ ఆలీ అక్కడికి రాబోతున్న



తరుణంలో ఆయన దృష్టిలో పడడానికి కార్యకర్తలంతా హంగామా సృష్టించారు. ఈ నేపథ్యంలోనే ఇనాయత్ ఆలీ బాక్రీ కాస్త వెనకకు జరగాలని లోధికి చెప్పాడు. దీంతో కాస్త వెనకకు జరుగగా హోమంత్రి కుమారుడు ఆజం కూడా నేను కూడా జరుగుతా ... మీరే నిలబడండి అంటూ వెనక్కి వెళ్లి పోవడంతో స్పందించిన ఇనాయత్ ఆలీ బాక్రీ వెళ్లాల్సింది మీరు కాదని... సల్లాఉద్దీన్ లోధి అంటూ దుర్భాషలాడుతూ, వెనక్కి పో అని బెదిరించాడు. వెంటనే నేను ఎందుకు పోవాలని లోధి ప్రశ్నించగా ఆగ్రహించిన ఇనాయత్ ఆలీ బాక్రీ లోధిపై మోచేతితో చాతిలో కొట్టాడు. కింద పడబోయిన లోధిని పక్కనే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు సర్ది చెప్పారు. కార్యక్రమంలో ఎలాంటి గొడవ వద్దని, ఏదైనా ఉంటే ఎమ్మెల్యే క్వార్టర్స్క్ వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలని లోధికి హోంమంత్రి కుమారుడు ఆజం సర్ది చెప్పడంతో వెనక్కి తగ్గినట్టు సమాచారం. కాసేపటికే అక్కడికి చేరుకున్న హోంమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దమణిగింది కానీ వర్గ పోరు మాత్రం తారా స్థాయికి చేరుకుందనే చెప్పుకోవచ్చు.

## దిశానిర్దేశం లేని విపక్ష పార్టీలు

### దేశం పేరును వాడుకుని ప్రజల్ని తప్పదోవ పట్టించలేరు.. ఓడిపోయి, అలసిపోయి, ఆశలేని మిగిలిపోయిన విపక్షాలు.. విపక్షాల పై నిప్పులు చెరిగిన ప్రదాని మోడీ

**జయభేరి, న్యూఢిల్లీ :**

ఇటీవల విపక్ష పార్టీలు తమ కూటమి పేరును ఇండియాగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇండియా అంటే ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇన్క్లూజివ్ అలియన్స్. మొత్తం 26 విపక్ష పార్టీల కలయికే ఇండియా అని ఇటీవల జరిగిన బెంగుళూరు భేటీలో కాంగ్రెస్ నేత ఖర్గే పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే కొత్తగా ఏర్పడిన ఇండియా కూటమిని ప్రధాని మోదీతీవ్రంగా విమర్శించారు.విపక్ష పార్టీలు దిశానిర్దేశం లేకుండా ఉన్నాయన్నారు. ఇండియన్ ముజాహిద్దిన్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా లాంటి సంస్థల్లోనూ ఇండియా పేరు ఉందని మోదీ ఆరోపించారు. ఇంతగా దిశలేని విపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని ప్రధాని మోదీ ఇవాళ జరిగిన బీజేపీ భేటీలో పేర్కొన్నారని సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.ఇండియన్ నేషనల్



కాంగ్రెస్, ఈస్ట్ ఇండియా కంపెనీ లాంటి పార్టీలను కూడా విదేశీయులు ప్రారంభించినట్లు ప్రధాని మోదీ విమర్శించారు. దేశం పేరును వాడుకుని ప్రజల్ని తప్పుదోవ పట్టించలేరని ప్రధాని ఆరోపించారన్నారు. ఓడిపోయి, అలసిపోయి, ఆశలేని పార్టీలుగా విపక్షాలు మిగిలిపోయినట్లు ప్రధాని పేర్కొన్నారు.

## కేంద్ర సర్కార్పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన

**జయభేరి, న్యూఢిల్లీ :**

మణిపూర్ అంశంపై పార్లమెంట్లో రగడ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ అంశంపై ప్రధాని మోదీ ఉభయసభల్లో మాట్లాడాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. అయితే ఆయన మౌనం వీడకపోవడం పట్ల ఆగ్రహంగా ఉన్న విపక్షాలు.. లోక్సభలో కేంద్ర సర్కార్పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇండియా పేరుతో కూటమిగా మారిన విపక్ష పార్టీలు ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. మణిపూర్ అంశం విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం వస్తోంది. ఈ నేపథ్యంలో విపక్ష కూటమి ఇండియా కూడా భారీ ఎత్తున నిరసన ప్రదర్శనకు సిద్ధమైంది. ఇవాళ బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విపక్ష పార్టీలపై ప్రధాని మోదీ ఫైర్ అయినట్లు తెలుస్తోంది.విపక్షాలకు చెందిన కొందరు ఎంపీలు.. పార్లమెంట్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద గత రాత్రి నుంచి ధర్నా కొనసాగిస్తున్నారు. మూడవ రోజు పార్లమెంట్ లో జరిగిన పరిణామాలను వాళ్లు తప్పుపడుతున్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్పై సెషన్ మొత్తం సస్పెన్షన్ విధించడంతో ఆయన అక్కడే ధర్నా చేస్తున్నారు. నిరసన చేపడుతున్న సంజయ్ సింగ్కు బీఆర్ఎస్ మద్దతు ఇస్తోంది.

## నాగర్ కర్నూలుకు రానున్న ప్రియాంక

**జయభేరి, హైదరాబాద్ :**

కర్ణాటక ఎన్నికల తర్వాత జోష్ మీద ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఈ నెల 30వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్లో ప్రియాంక గాంధీతో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ప్లాన్ చేసింది కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే రాహుల్ గాంధీ వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ ప్రకటించారు. ప్రియాంక గాంధీ ఇబ్రహీంపట్నం సభలో యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. అయితే ఇప్పుడు ప్రియాంక గాంధీ కొల్లాపూర్ సభలో మహిళ డిక్లరేషన్ ప్రకటించబోతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే కాంగ్రెస్ మహిళ డిక్లరేషన్లో ఎలాంటి అంశాలు ఉంటాయి అనే అంశంపై ఇప్పుడు ఆసక్తిగా చర్చ నడుస్తుంది. కర్ణాటక తరహాలో మహిళలకు ఆర్టీసీ బస్లో ఉచిత ప్రయాణం హామీ ఉంటుందని కాంగ్రెస్ వర్గాల నుండి తెలుస్తుంది. అంతే కాకుండా మరో 4 కీలకమైన హామీలు ఉండబోతున్నాయనీ తెలుస్తుంది. మరి కాంగ్రెస్ ఎలాంటి హామీలను తెలంగాణ మహిళలకు ఇస్తారు అనేది చూడాలి.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

**జయభేరి, కర్నూలు :**

శ్రీశైలం దోర్నాల ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. దాంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దోర్నాల మండలం తుమ్మల బైలు చెంచుగూడెం సమీపంలోని నల్లమల ఘాట్ రోడ్డులో బస్సు, టిప్పర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సులో లోని పలువురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. సుమారు 2 గంటల పాటు వాహన రాకపోకలు స్తంభించాయి. ప్రయాణాకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# చైర్మన్ రేసుకు చాంతాండంత లిస్ట్

**జయభేరి, తిరుమల :**

ప్రపంచంలో అతి పెద్ద ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణకు ఏపీ ప్రభుత్వం పాలకమండలిని నియమిస్తూ ఉంటుంది. టీటీడీ పాలక మండలిలో చైర్మన్ పదవి నుండి పాలక మండలి సభ్యులుగా బాధ్యత నిర్వర్తించేందుకు రాజకీయ నాయకుల నుండి, బడా పారిశ్రామిక వేత్తల వరకూ భారీగా పోటీ పడుతుంటారు. ఇందుకోసం కేంద్ర రాజకీయ ప్రముఖుల వద్ద నుండి సైతం సిఫార్సులు చేయిస్తూ ఉంటారు. వైకుంఠ వాసుడి సేవ చేసే భాగ్యం దక్కితే చాలు ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తూ ఉంటారు. అలాంటిది శ్రీ వేంటేశ్వరుడిని అతి దగ్గరగా సేవ చేసే భాగ్యంతో పాటుగా, అతి సమీపంగా స్వామి వారి చూసి తరించే భాగ్యం లభించడమంటే వారి జన్మ సార్ధకం అయినట్లే. అందుకే టీటీడీ పాలక మండలి పదవులకు దేశంలో ఏ పదవీకి లేనంత డిమాండ్ ఉంటుంది అనడంలో ఎటువంటి ఆశ్చర్యం లేదు.టీటీడీలోని నిర్వహణ కార్యక్రమాలను టీటీడీ పాలకమండలే స్వయంగా చూస్తూ ఉంటుంది. అయితే గతంలో 18 మంది సభ్యులతో కూడిన పాలకమండలి నియామకం జరిగేది. 2019లో ఏపీ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా, కనీవిని ఎరుగని రీతిలో దాదాపు 35 మంది సభ్యులతో టీటీడీ పాలక మండలిని ఏర్పాటు చేయడంతో పాటుగా, పలు రాష్ట్రాలకు సంబంధించిన టీటీడీ స్థానిక సంస్థల చైర్మన్లను సైతం టీటీడీ పాలక మండలి సభ్యుల తరహాలోనే వ్యవహరించే విధంగా నిర్ణయం తీసుకుంది. గతంలో అధిక ప్రాధాన్యం తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన వారికే ఇచ్చే సాంప్రదాయం ఉండేది. ఇక బయట రాష్ట్రాలకు చెందిన వారికి ఒక్కొక్కరికి మాత్రమే పాలక మండలిలో చోటు కల్పించేవారు.వైసీపీ ప్రభుత్వం ఈ సాంప్రదాయానికి విరుద్ధంగా బయట రాష్ట్రాల వారికే అధిక మందికి పాలక మండలిలో స్థానం కల్పించింది. దీంతో పాలక మండలి నియామకంపై హిందూ సంఘాలు, ప్రతిపక్షాలు, శ్రీవారి భక్తులు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. కానీ అవేవీ లెక్కలోకి తీసుకోకుండా ముందుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 35 మందితో పాలక మండలి కమిటీని కొనసాగించింది. వైసీపీ ప్రభుత్వం పాలక మండలి నియమించి దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో పాటుగా ఈ ఏడాది ఆగస్టు 12వ తారీఖుకి పాలక మండలి గడువు ముగియనుంది. 2021 ఆగస్టు 12వ తారీఖున టీటీడీ చైర్మన్ గా వైవీ



సుబ్బారెడ్డిని రెండోసారి నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, టీటీడీ పాలక మండలి సభ్యులను మాత్రం సెప్టెంబర్ చివరి వారంలో నియమించింది. చైర్మన్ గా వైవీ.సుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచే పాలకమండలి గడువు అమలులోకి వస్తుంది. అలా ప్రస్తుత పాలకమండలి గడువు ఆగస్టు 12వ తేదీతో ముగియనుంది.ఏపీ రాష్ట్రంలో ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి గత కొంత కాలంగా బిజీ బిజీగా రాజకీయాలను చక్క బెట్టడంతో పాటుగా, టీటీడీ నిర్వహణ వ్యవహారాలను సైతం చూస్తూ వస్తున్నారు. అయితే రెండు భాధ్యతలు టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డిపై ప్రభుత్వం పెట్టడంతో అధిక సమయం రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను స్వయంగా చూసుకోవాల్సి వస్తుంది. ఈ తరుణంలో వైవీ.సుబ్బారెడ్డి అవసరం ఉన్న కారణంగా మరోసారి టీటీడీ చైర్మన్ గా భాధ్యతలు నిర్వహణ ఇచ్చే విషయంపై ప్రభుత్వం వెనుకడుగు వేస్తోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం రెండు ఆప్షన్లపై మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇందులో మొదటి ఆప్షన్ నూతన పాలక మండలి ఏర్పాటు చేయడం గానీ, రెండోవ ఆప్షన్ మరో ఏడాది పాటు తాత్కాలికంగా టీటీడీ నిర్వహణ భాధ్యతలు చూసుకునేందుకు స్పెసిఫైడ్ అధారిటీని నియమించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు ఆప్షన్స్ లో రెండోవ ఆప్షన్ పైనే ప్రభుత్వం ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి గడువు ఈ ఏడాది ఆగస్టుకి ముగియనున్న క్రమంలో ఆశావాహుల సంఖ్య అధికంగానే ఉన్నట్టు సమాచారం. పాలక మండలిలో స్థానం దక్కించుకునేందుకు ఇప్పటికే ఆశావాహులు కేంద్రంలోని కీలకమైన నాయకులు, గవర్నర్ లు, ఇతర రాష్ట్ర సీఎంల వద్ద నుండి వద్ద ఏపీ రాష్ట్ర ప్రభుత్వంకు సిఫార్సులు సైతం పంపినట్లు తెలుస్తుంది. టీటీడీ పాలక మండలిలో చోటు దక్కించుకునేందుకు సిఫార్సు లేఖలు అధికంగా వస్తుండడం ఏపీ ప్రభుత్వంకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇదే తంతూ కొనసాగితే ప్రస్తుతం పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులతో పాటుగా 50 మంది సభ్యులు ఉండగా, పాలక మండలిలో సభ్యుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించిన జంబో పాలక మండలిపై, పాలక మండలిలోకొందరు అనర్హులు ఉన్నారని బిజేపి నేతలు కోర్టుకు వెళ్ళగా, ఇప్పటికి ఆ విషయం కోర్టులోనే ఉంది.ప్రత్యేక ఆహ్వానితులకు పాలక మండలిలో చోటు లేదంటూ కోర్టు ఆర్డినెన్స్ జారీ చేయడంతో 35 మంది పాలక మండలి సభ్యులుగా ఉండాలని కోర్టు ఆదేశం జారీ చేయడంతో ఇకపై నియమించే పాలక మండలిలో కేవలం 35 మంది సభ్యులకే చోటు కలిగించే పరిస్థితి ఉంది. మరో వైపు ఎపిలో ఎన్నికలు దగ్గర పడే అవకాశం ఉన్న క్రమంలో ఇప్పుడు టీటీడీ పాలక మండలి ఏర్పాటు చేస్తే, బయటి వ్యక్తులకు అవకాశం కల్పిస్తే ఏపీలోని కొందరు ముఖ్య నేతల నుండే అసంతృప్తి ఎదురు అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంకు వచ్చిన ఒత్తిడుల నేపథ్యంలో పాలక మండలి నియమాకం కంటే స్పెసిఫైడ్ అథారిటిని నియమించే యోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అయితే టీటీడీ పాలక మండలి నియమిస్తే టీటీడీ చైర్మన్ పదవికి జంగా కృష్ణమూర్తితో పాటుగా, చెవిరెడ్డిభాస్కర్ రెడ్డి ఆశిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ పాలక మండలిపై వస్తున్న ఒత్తిడులను తట్టుకుని పాలక మండలి నియమిస్తుందా. లేక స్పెసిఫైడ్ అధారిటీని నియమిస్తుందా అనే మాత్రం వేచి చూడాలి.

# ఆర్ 5 జోన్ ఇళ్లపై ఎక్కే గడప.. దిగే గడప

**జయభేరి, విజయవాడ :**

రాజధానిగా అమరావతి కొనసాగాలని, మూడు రాజధానులు వద్దని ఆందోళన చేస్తున్నవారు తమ పిటిషన్లతో కోర్టుల్లో పోరాటం చేస్తుంటే, మరోవైపు అమరావతి (సీఆర్డీయే) ప్రాంతంలో పేదల ఇళ్ల నిర్మాణానికి సీఎం స్వయంగా తన చేతులతో శంకుస్థాపన చేశారు. పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు రాకూడదని ఇప్పటికే హైకోర్టులో 18, సుప్రీంకోర్టులో 5 కేసులు వేశారని వాటిని అధిగమించుకుంటూ ముందుకు వెళ్తున్నామని వెంకటపాలెం సభలో ముఖ్యమంత్రి అన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే.. రాక్షసుల్లా అడ్డుకుంటున్నారని వ్యాఖ్యానించారు.అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం సీఆర్డీయే చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టంలో సెక్షన్ 53 (1) (d)లో కనీసం 5 శాతం భూమిని ఎకనామికల్ వీకర్ సెక్షన్‌కు ఇవ్వాలని నిర్దేశించారు. కాని మాస్టన్ ప్లాన్ రూపొందించినప్పుడు మాత్రం నాలుగు జోన్లు మాత్రమే ఏర్పాటు చేశారు. జోన్1లో ఇప్పుడున్న 29 గ్రామాలు, జోన్2లో ఉన్నతస్థాయి వ్యక్తులకు, ఆ వర్గాలకు కేటాయించారని, జోన్3లో రైతులకు ఇచ్చే రిటనబుల్ ప్లాట్స్ ఇచ్చారని, జోన్4లో హైరైజ్ బిల్డింగ్స్‌కు కేటాయించారంటూ ఈ ప్రభుత్వం చట్టసవరణకు దిగింది. సీఆర్డీయే చట్టంలో చెప్పినట్టుగా, 5శాతం స్థలం అంశం జోనింగ్‌లో ఎక్కడుందనీ, పేదవాడి విషయాన్ని పూర్తిగా విస్మరించినట్టేనని అందుకే చట్టాన్ని సవరిస్తున్నట్టుగా పేర్కొంది.ప్రభుత్వం మొత్తంగా 4 కీలక సవరణలు సీఆర్డీయే చట్టాన్ని సవరిస్తూ యాక్ట్ 13ను తీసుకు వచ్చింది.

1) గత ప్రభుత్వం సీఆర్డీయే చట్టాన్ని రూపొందించినప్పుడు చట్టాన్ని సవరించాలంటే కొన్ని నిబంధనలు పెట్టింది. కేవలం స్థానిక సంస్థలు తీర్మానంతో చట్టాన్ని



సవరించాలని అందులో పొందుపరించింది. ఇప్పుడు అమరావతి ప్రాంతంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగలేనందున దీన్ని సవరిస్తూ స్థానిక సంస్థలు లేదా పర్సన్ ఇన్‌ఛార్జి లేదా సుమోటోగా సీఆర్డీయే చట్టంలో మార్పులు చేయవచ్చంటూ ఈ ప్రభుత్వం సవరణ చేస్తూ యాక్ట్ 13ని తీసుకు వచ్చింది.

2) ఇక రెండో సవరణ ఏంటంటే గతంలో సీఆర్డీయే మాస్టర్ ప్లాన్‌లో నాలుగు జోన్లు ఉంటే.. కొత్తగా ఐదో జోన్‌ను ఈప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఐదో జోన్‌లోనే పేదలకు ఇళ్లస్థలాలను కేటాయించింది.

3) ఇక మూడో సవరణ, పాత సీఆర్డీయే మాస్టర్ ప్లాన్‌లో ల్యాండ్ అలాట్‌మెంట్ రూల్స్ ప్రకారం ఒక ఇల్లు కట్టుకుంటే ఉండాల్సిన కనీస స్థలం 100 గజాలు అని ఉంది. అంటే.. ఈడబ్ల్యూఎస్‌కింద ఇళ్లు మంజూరుకు ఈ నిబంధన అడ్డంకి అని, అంటే దాదాపుగా పేదవాళ్లకి ఇల్లు ఇవ్వడం అనేది కుదరంటూ దీన్ని మారుస్తూ ఇప్పటిక ప్రభుత్వం చట్టానికి సవరణ చేసింది. తద్వారా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలకు అనుగుణంగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేలా ఆ రూల్స్‌లో మార్పు చేసింది.

4) అలాగే అప్పటి ప్రభుత్వం చేసిన సీఆర్డీయే యాక్ట్‌లో కేవలం హౌసింగ్ అని మాత్రమే పొర్కొన్నారు. అంటే ఇళ్ల నిర్మాణాన్ని గురించి ప్రస్తావించింది. ఇళ్ల స్థలాలు పట్టాలు ఇవ్వకుండా ఇంటి నిర్మాణాలు ఎలా సాధ్యం అనేది ఈ ప్రభుత్వం వేసిన ప్రశ్న. పేదవాళ్లు అమరావతి రాకూడదనే ఉద్దేశంతోనే పాత చట్టంచేశారని వైసీపీ పలుమార్లు విమర్శలు కూడా చేసింది. అందుకే దీన్ని సవరిస్తూ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం అనే రెండు పదాలనూ సీఆర్డీయే చట్టంలో జోడించింది. అయితే వీటిని సవాల్ చేస్తూ పెద్ద ఉత్తున పిటిషన్లు ఇటు హైకోర్టులోనూ అటు సుప్రీంకోర్టులోనూ దాఖలయ్యాయి. అయితే స్టే ఇవ్వడానికి, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి రెండు చోట్లా న్యాయస్థానాలు అంగీకరించలేదు. చట్ట సవరణకు సంబంధించిన యాక్ట్ 13లో వివిధ అంశాలమీద, అలాగే ఇంటిస్థలాలు కేటాయిస్తూ ఇచ్చిన జీవోమీద ఈ పిటిషన్లు వేశారు. మళ్లీ తాజాగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఒకే అంశంమీద సుప్రీంకోర్టులో ఒక అభిప్రాయం వచ్చాక మళ్లీ మళ్లీ హైకోర్టులో ఎలా వేస్తారని ప్రభుత్వం వాదిస్తోంది. ఈకేసుల అంశాన్నే ఇవాళ ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ సందర్భంగా వెంకటపాలెం సభలో సీఎం జగన్ ప్రస్తావించారు.“ఇళ్లపట్టాలు ఇవ్వకుండా ఆపలేకపోయారు కాబట్టి... పేదల ఇళ్లు నిర్మాణానికి కూడా అడ్డుతగిలేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వీరు ఎక్కని గడపా లేదు. దిగని గడపా లేదు. కలవని కేంద్ర మంత్రీ లేదు, కేంద్ర సెక్రటరీ కూడా లేదు. ఇంతమందిని కూడా కలిసి అడ్డుకునేందుకు చివరి ప్రయత్నంగా మళ్లీ హైకోర్టులో కూడా కేసు వేశారు. ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ, ఎక్కడా ఉండదు'' అంటూ సీఎం అన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తొలి లబ్ధిదారునికి ఇచ్చిన మోడల్ హౌస్ నిర్మాణాన్ని కేవలం నాలుగు రోజుల వ్యవధిలో అధికారులు పూర్తిచేయడం, వారి వేగానికి అద్దంపట్టింది. ప్రిఫాబ్రికేటెడ్ టెక్నాలజీని వాడుకుని, ఆప్షన్3 కింద ప్రభుత్వమే వాటిని నిర్మించిన ఇచ్చేలా యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టేందుకు ప్రభుత్వం అన్నిరకాల ఏర్పాట్లూ చేసింది. మరి ఈ పోరాటంలో గెలిచేది ఎవరు? అమరావతి ఆందోళన కారులా? పేదల ఇళ్లా?

# కలకలం రేపుతున్న సునీత కామెంట్స్

**జయభేరి, కడప :**

వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టుకు సమర్పించిన ఛార్జ్ షీట్ లో సంచనాలు వెలుగుచూస్తున్నాయి. వివేకా కుమార్తె సునీత వాంగ్మూలంలో వైఎస్ భారతి, సజ్జలపై చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ కోర్టుకు ఛార్జ్ షీట్ సమర్పించింది. ఈ ఛార్జ్ షీట్ లో సంచలన విషయాలు ప్రస్తావించింది సీబీఐ. వివేకా కుమార్తె సునీత దర్యాప్తులో వెల్లడించిన కీలక విషయాలను ఛార్జ్ షీట్ లో ప్రస్తావించింది సీబీఐ. వైఎస్ భారతి 2019 మార్చి 22న... ఇంటికొచ్చి కలుస్తానంటూ తనకు ఫోన్ చేశారని సునీత తెలిపారు. తనకు పనిఉందని చెప్పడంతో ఎక్కువ సమయం తీసుకోనని చెప్పి... భారతి, వైఎస్ విజయమ్మ, సజ్జల రామకృష్ణారెడ్డి, అనిల్ రెడ్డి మా ఇంటికి వచ్చారన్నారు. ఆ సమయంలో భారతి కొంత ఆందోళనకరంగా కనిపించారన్నారు. వివేకా మరణించిన తర్వాత పలకరింపునకు తొలిసారి ఇంటికొచ్చినందుకు అలా బాధగా ఉన్నారని అనుకున్నానన్నారు. అప్పుడు భారతి ఇకపై ఏం చేసిన సజ్జలతో టచ్‌లో ఉండాలని చెప్పారన్నారు. వివేకా హత్యపై మీడియాతో మాట్లాడాలని తనకు సజ్జల చెప్పారన్నారు. మీడియాతో మాట్లాడేటప్పుడు జగనన్నతో పాటు అవినాష్ పేరు కూడా ప్రస్తావించాలని సలహా ఇచ్చారని సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్పష్టం చేశారు. సునీత ఓ వీడియో రికార్డు చేసి సజ్జలకు పంపిస్తే.. వీడియో కాదు ప్రెస్ మీట్ పెట్టాలని చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే అది తనకు ఇబ్బందిగా అనిపించిందన్నారు సునీత. అవినాష్ అభ్యర్థిత్వాన్ని వివేకా కోరుకోలేదన్నారు. మా రెండు కుటుంబాల మధ్య దశాబ్దాలుగా వివాదాలు ఉన్నాయని సునీత వాంగ్మూలంలో పేర్కొన్నారు.వివేకా హత్య కేసు ఛార్జ్ షీట్ లో ఫొటోలు, గూగుల్ టేకౌట్, లోకేషన్ డేటాను సీబీఐ కోర్టుకు సమర్పించింది. వివేకా హత్యకు వైఎస్ అవినాశ్, భాస్కర్ రెడ్డి కుట్ర చేశారని వెల్లడించింది. వివేకా హత్య కేసుపై దర్యాప్తు ఇంకా కొనసాగుతుందని తెలిపింది. పీఏ కృష్ణారెడ్డిపై కూడా అనుమానాలు ఉన్నాయని, అయితే ఆధారాలు లభించలేదన్నారు. ఆధారాలు చెరిపివేత సమయంలో మనోహర్ రెడ్డి ఉన్నప్పటికీ హత్యలో



అతని ప్రమేయం నిర్ధారణ కాలేదన్నారు. వివేకా ఇంట్లో వైఫై రూటర్లకు కనెక్టు అయిన వారి వివరాలు సేకరిస్తున్నామని సీబీఐ కోర్టుకు తెలిపింది. వైఫై రూటర్స్ నుంచి వివరాల కోసం అమెరికా అధికారులను సంప్రదించామన్నారు. వివేకా లేఖపై నిన్ హైడ్రేన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వీటి ఫోరెన్సిక్ నివేదిక అందాల్సివుందని సీబీఐ ఛార్జ్ షీట్ లో పేర్కొంది.వైఎస్ వివేకా హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసు నుంచి విచారిస్తున్న సీబీఐ వైఎస్ షర్మిలను కూడా సాక్షిగా ప్రస్తావించింది. 259వ సాక్షిగా పేర్కొంటూ కేంద్ర దర్యాప్తు సంస్థ... కోర్టుకు ఛార్జ్ షీట్ సమర్పించింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటి వరకు విచారించిన వారి వాంగ్మూలాలు నమోదు చేసి గత నెల 30న కోర్టుకు సమర్పించింది. ఇందులో కీలక విషయాలు ప్రస్తావించింది. హత్య జరగటం, బయటి రావటంతో పాటు.. ఎవరికి ఎవరు సమాచారం ఇచ్చారు వంటి అంశాలను పేర్కొంది. వైఎస్ఆర్టీసీ అధినేత్రి షర్మిల గత ఏడాది అక్టోబర్ 7న దిల్లీలో ఈ కేసులో వాంగ్మూలాన్ని ఇచ్చారని సీబీఐ తెలిపింది. తన వద్ద ఎలాంటి కచ్చితమైన ఆధారాలు లేవని, అయితే రాజకీయ కారణాలతో హత్యకు పాల్పడ్డారని వైఎస్ షర్మిల చెప్పినట్లు వివరించింది. హత్య వెనుక కుటుంబం లేదా ఆర్థిక అంశాల ప్రమేయం లేదన్న విషయాన్ని ఆమె ఖండించినట్లు పేర్కొంది. కడప ఎంపీగా పోటీ చేయాలని తనని వైఎస్ వివేకా కోరారని... ఎంపీగా అవినాష్ పోటీ చేయొద్దని కోరుకుంటున్నట్లు షర్మిల చెప్పినట్లు తెలుస్తోంది.

# మళ్లీ గన్నవరం లొల్లి

**జయభేరి, విజయవాడ :**

అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వరుసగా నియోజకవర్గ పంచాయతీలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే రామచంద్రాపురం నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యుడు, మంత్రి కి మద్య విభేదాలు రచ్చకెక్కాయి. తాజాగా గన్నవరం ఎపిసోడ్ కూడా అధికార పార్టీలో తెర మీదకు వచ్చింది గన్నవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు స్థానిక శాసన సభ్యుడు వల్లభనేని వంశీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారు. ఇప్పటి కే ఈ వ్యవహారం పై స్వయంగా ముఖ్యమంత్రి జగన్ కూడ ఆరా తీశారు. వల్లభనేని వంశీకి సీటు ఇస్తామని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. అయితే వంశీ కి సీటు ఇవ్వటం పై గన్నవరంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులు దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకటరావు వంశీకి వ్యతిరేకంగా మరో సారి సమావేశం అయ్యారు. వంశీకి ఎట్టిపరిస్దితుల్లో మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని, వైఎస్ఆర్ కాంగ్రెస్ స్థానిక నాయకత్వం కుండబద్దలు కొట్టి చెబుతోంది. అయితే గన్నవరం నియోజకవర్గం సీటు తనదేనని శాసన సభ్యుడు వల్లభనేని వంశీ చెబుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్ తనకు స్వయంగా హామీ ఇచ్చారని చెబుతున్నారు. అయితే స్దానిక నాయకత్వం పార్టీ కి వ్యతిరేకంగా కార్యకలాపాలను నిర్వహించటం సమంజసం కాదని వంశీ గతంలో బహిరంగంగా వ్యాఖ్యానించారు. అయితే తెలుగు దేశం పార్టి టిక్కెట్ పై గెలిచిన వంశీ, ఎన్నికల తరువాత పార్టీ మారి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టిలో చేరటం తో వివాదానికి కారణం అయ్యింది. వంశీకి సీటు ఇస్తే ఎట్టి పరిస్దితుల్లో తాము సహకరించేది లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశారు.ఎన్నికల సమయంలో పార్టీల్లో నేతల మద్య విభేదాలు బయట పడట కామన్ గా జరుగుతుంటాయి. అయితే అధికార పార్టీలో గ్రూపుల గోల ఇంకాస్త ఎక్కువగా ఉంటుంది. అటు మంత్రి జయరాం నియోజకవర్గంలో కూడ అదే సీన్ కనిపిస్తోంది. కపట్రాళ్ల బొజ్జమ్మ మంత్రి నిర్వహించే కార్యక్రమాలకు దూరంగా ఉండటం పార్టీలో చర్చకు దారితీసింది. ఇటీవలే కపట్రాళ్ళ ఫ్యామిలీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఇలా వరుసగా వివాదాలు నెలకొంటున్న నేపద్యంలో పార్టీలో పరిస్దితులు పై అధి నాయకత్వం ప్రత్యేకంగా శ్రద్ద పెట్టింది. పార్టీ నాయకత్వం కూడా ఆయా నియోజకవర్గాల పరిస్దితులు పై ఎప్పటికప్పుడు నివేదికలను తెప్పిస్తోంది. ఐ ప్యాక్ టీం లతో పాటుగా, ప్రైవేట్ సర్వేల ద్వారా కూడ నియోజకవర్గాల రిపోర్ట్ లను తెప్పిస్తున్నారు.

# తాడేపల్లికి చేరిన రామచంద్రాపురం పంచాయితీ

**జయభేరి, కాకినాడ:**

రామచంద్రపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయితీ మరోసారి తాడేపల్లి వేదిక అయింది. పార్టీ మారతానంటూ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కామెంట్ చేయడంతో రాజకీయం రసవత్తరంగా మారింది..రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వేణు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్ ముందే రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తన వాదన వినిపించారు. ఎట్టి పరిస్థితుల్లో రామచంద్రాపురం నియోజకవర్గంలో తన కుమారుడికి సీటు కావాలని బోస్ స్వయంగా ముఖ్యమంత్రికి వివరించారు. అయితే మరోవైపు పార్టీ పరంగా మరోసారి మంత్రి చెల్లుబోయిన వేణుకు మాత్రమే సీటు ఉంటుందని పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి వెల్లడించారు. దీనిపై సుభాష్ చంద్రబోస్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.మంత్రి వేణుకు మరోసారి రామచంద్రాపురం నియోజకవర్గ సీటును కేటాయించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవటం పట్ల రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ తీవ్ర అసహనంతో ఉన్నారు. అదే జరిగితే తాను ఇండిపెంటెండ్ గా అయినా సరే వచ్చే ఎన్నికల్లో రామచంద్రాపురం నుంచి బరిలోకి దిగుతానని బోస్ ప్రకటించారు. దీంతో అప్రమత్తం అయిన పార్టీ నాయకత్వం ప్రస్తుత పరిస్థితులపై అంచనాలు వేస్తోంది. పార్టీలో అత్యంత సీనియర్ గా ఉన్న బోస్ కు జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఎమ్మెల్సీ గా ఎంపిక చేసి ఆ తరువాత ఎవ్వరూ ఊహించని విధంగా రాజ్యసభకు పంపారు. అలాంటిది ఇప్పుడు పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా పిల్లి సుభాష్ చంద్రబోస్ వ్యాఖ్యలు చేయడం ఫ్యాన్ పార్టీలో కలకలం రేపుతోంది.బోస్ వ్యవహారంపై గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మిదున్ రెడ్డితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల సమావేశం అయ్యారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పరిస్తితుల పై ఇరువురు నేతలు చర్చించారు. మంత్రి చెల్లుబోయిన వేణుకు సీటు ఇస్తే పార్టిలో కూడ ఉండబోనని, స్వతంత్ర అభ్యర్ధిగా బరిలోకి దిగుతానంటూ పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రకటన వెనుక కారణాలు గురించి నేతలు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారం సీరియస్ గా మారటంతో మరోసారి ముఖ్యమంత్రి జగన్ ముందే పంచాయితీ పెట్టాలని నాయకులు భావిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి మూడు సార్ల శాసన సభ్యుడిగా గెలుపొందిన తోట త్రిమూర్తులు, మిథున్ రెడ్డికి జగన్ పూర్తి స్థాయి భాధ్యతలను అప్పగించారని అంటున్నారు.పిల్లి సుభాష్ చంద్రబోస్ కు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవి నుండి నేరుగా రాజ్యసభకు సైతం పంపారు. ఎమ్మెల్సీ స్దానాలను రద్దు చేయాలని జగన్ తీసుకున్న నిర్ణయం తరువాత బీసీ వర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎవ్వరూ ఊహించిన విధంగా పిల్లిని రాజ్య సభకు జగన్ ఎంపిక చేయటం సంచలనం అయ్యింది. పిల్లి వంటి సీనియర్ నేతలు, జగన్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నోరు విప్పటం కూడా ఇప్పుడు చర్చనీయాశంగా మారింది.

# ఏపీలో మూతపడిన 118 స్కూళ్లు


**జయభేరి, విశాఖపట్టణం :**


రాష్ట్రంలో పలు చోట్ల పల్లెబడులను జగన్ సర్కార్ మూసేసింది. 202324 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గడమే అందుకు కారణం. దీంతో మూడో తరగతి, నాలుగో తరగతి, ఐదో తరగతులను ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేస్తున్నారు. 1, 2 తరగతుల్లో విద్యార్థుల చేరికలు తగ్గాయి. గతేడాది పదిమంది లోపు విద్యార్థులున్న బడుల్లో ఈ ఏడాది ఒక్కరూ చేరలేదు. ఉన్నవారు వేరే పాఠశాలలకు వెళ్లిపోవడంతో విద్యార్థులు లేరంటూ రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 118 ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం మూసేసింది. మరో 50 ఎయిడెడ్ పాఠశాలలకూ ఇదే దుస్థితి. తరగతుల విలీనాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులతోపాటు 70 మంది అధికారపార్టీ ఎమ్మెల్యేలు సైతం వ్యతిరేకిస్తూ విద్యాశాఖ మంత్రి బొత్సకు లేఖలు రాశారు. కొన్నింటిని మినహాయించి మిగతావన్నీ విలీనం చేసేశారు.ప్రపంచబ్యాంకు రుణం కోసం మానవవనరుల వ్యయాన్ని తగ్గించుకుంటామన్న నిబంధనలో భాగంగా ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించుకునేందుకు పాఠశాలలను మూసేస్తున్నారు. విద్యాహక్కు చట్టానికి సైతం సవరణ చేసి కిలోమీటరు దూరంలో ఉండాల్సిన 3,4,5 తరగతులను మూడు కిలోమీటర్ల దూరం వరకు ఉండేలా సవరించారు. అంగన్‌వాడీ కేంద్రాలనూ కిలోమీటరు దూరంలో ఉండొచ్చని సవరించేశారు. దూరాబారం వెళ్లలేక విద్యార్థులు సగంలోనే చదువు మానేస్తున్నరు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,73,416 మంది విద్యార్థులు చదువు మధ్యలోనే మానేశారు. వీరిలో వలసల కారణంగా 49,099 మంది విద్యార్థులు బడి మానేసి ఇళ్ల వద్ద ఉంటున్నారు.జాతీయ విద్యావిధానంలో భాగంగా రాష్ట్రంలో పాఠశాలల విలీనాన్ని చేపట్టామని, ఈ ప్రక్రియలో ఎక్కడైనా ఒక్క పాఠశాల మూతపడినా నాదే బాధ్యత అని 2022 జూన్ 28న అమ్మఒడి నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం జగన్ అన్నారు. కేవలం ఒకే ఒక్క హైస్కూలు విద్యార్థిని కోసం జపాన్‌లోని హక్కైడో ఉత్తర ద్వీపంలోని కమీ షిరాటకి రైల్వేస్టేషన్ మీదుగా రోజుకు రెండుసార్లు రైలు నడిపింది అక్కడి ప్రభుత్వం. ఒక్క విద్యార్థి కోసం మూడేళ్లు ఇలాగే కొనసాగించారు. వారితో పోల్చితే ఏపీ సర్కార్ విద్యకు ఇచ్చే ప్రాధాన్య ఏపాటితో తెలుస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

జయభేరి సినిమా

# 'బ్రో'..

పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటిస్తోన్న సినిమా 'బ్రో'. తమిళ్ లో సూపర్ హిట్ సాధించిన మూవీ 'వినోదయ సిత్తం'కు ఇది తెలుగు రిమేక్. దీనికి సముద్రఖని దర్శకత్వం వహించారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీలో కేతిక శర్మ, ప్రియా వారియర్, బ్రహ్మానందం, సముద్రఖని ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ జులై 28 న ప్రేక్షకుల ముందుకు రానుంది.





# హైదరాబాద్ కాలేజ్‌లో సందడి చేయనున్న తమన్నా..

హైదరాబాద్ కాలేజ్‌లో సందడి చేయనుంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. జైలర్ మూవీ సాంగ్ రిలీజ్ కోసం ఆమె సీఎంఆర్ కాలేజీకి వస్తోంది. మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా బుధవారం హైదరాబాద్ లోని ఇంజినీరింగ్ కాలేజీకి రానుంది. రజనీకాంత్ తో ఆమె నటిస్తున్న జైలర్ మూవీ తెలుగు సాంగ్ రిలీజ్ కోసం ఆమె సీఎంఆర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీకి వెళ్లనుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి కావాలా సాంగ్ తమిళంలో రిలీజైన విషయం తెలిసిందే. ఇప్పుడిదే సాంగ్ తెలుగులో రిలీజ్ కానుంది. దీని కోసమే ఆమె సీఎంఆర్ కాలేజీకి వెళ్లనుంది. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ సాంగ్ సెన్సేషనల్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే తెలుగులో ఈ పాటను ఎవరు పాడారన్నదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్ట్ చేసిన జైలర్ మూవీలో రజనీకాంత్ కు జోడీగా తమన్నా నటిస్తోంది. ఈ సినిమా ఆగస్ట్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరుసటి రోజే రానున్న చిరంజీవి భోళా శంకర్ మూవీతో జైలర్ పోటీ పడనుంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్, కన్నడ నటుడు శివ రాజ్ కుమార్, నాగేంద్ర బాబు, రమ్య కృష్ణ, సునీల్, యోగి బాబులాంటి వాళ్లు నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మించింది. ఈ సినిమా ఫైనల్ రన్‌టైమ్‌ను రివీలైంది. రెండు గంటల నలభై తొమ్మిది నిమిషాల నిడివితో జైలర్ మూవీని రిలీజ్ చేయబోతున్నారు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీలో రజనీకాంత్ పవర్ ఫుల్ జైలర్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. జైలులో ఉన్న కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్‌ను విడిపించేందుకు అతడి అనుచరులు ఆ జైలుపై సడెన్‌గా ఎటాక్ చేస్తారు. ఆ ఎటాక్ ను ఒంటరిగా జైలర్ ఎలా ఎదుర్కొన్నాడనే పాయింట్‌తో ఈ సినిమా రూపొందుతోన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో గ్యాంగ్‌స్టర్‌గా నెగెటివ్ షేడ్స్‌తో కూడిన క్యారెక్టర్‌లో శివరాజ్‌కుమార్ కనిపించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోకేష్ కనకరాజ్ తెరకెక్కించిన ఖైదీ ఛాయలతో జైలర్ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది.జైలు ఎపిసోడ్స్ మొత్తం ఖైదీని గుర్తుచేస్తాయని అంటున్నారు. దాదాపు 200 కోట్ల బడ్జెట్‌తో జైలర్ మూవీని సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్ని అందిస్తోన్నాడు.



## 'స్లమ్ డాగ్ హస్బెండ్'

నటుడు సంజయ్ రావు హీరోగా ప్రణవి మానుకొండ హీరోయిన్ గా నటించిన సినిమా 'స్లమ్ డాగ్ హస్బెండ్'. ఈ సినిమాకు ఏ ఆర్ శ్రీధర్ దర్శకుడు. బ్రహ్మాజీ, సప్తగిరి కీలక పాత్రల్లో నటించారు. జాతకంలో దోషం ఉన్న ఓ యువకుడు కుక్కను పెళ్లి చేసుకోవడంతో అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది అనేదే కథ. ఈ మూవీ జులై 29 న విడుదల కానుంది.



# బ్రో ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా ఊర్వశి రౌటేలా..

పవన్ కల్యాణ్, సాయిధరమ్ తేజ్ కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ బ్రో. ఫాంటసీ కామెడీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి సముద్రఖని దర్శకత్వం వహిస్తున్నాడు. బ్రో జులై 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు రెడీ అవుతోంది. ఈవెంట్‌కు తెలుగు రాష్ట్రాల నలుమూలల అభిమానులు, మూవీ లవర్స్ పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా స్పెషల్ సాంగ్‌లో మెరవబోతున్న విషయం తెలిసిందే. ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో ధగధగ మెరిసిపోతూ ఈవెంట్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది ఊర్వశి రౌటేలా. ఇప్పుడీ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ప్రియా ప్రకాశ్ వారియర్, కేతిక శర్మ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ షేర్ చేసిన బ్రో బీటీఎస్ ఫొటోలు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతున్నాయి. బ్రో నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తూ.. మంచి బజ్ క్రియేట్ చేస్తున్నాయి. బ్రో నుంచి సాయిధరమ్ తేజ్, పవన్ కల్యాణ్ కాంబోలో వచ్చే మై డియర్ మార్కండేయ సాంగ్ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. మరోవైపు సాయిధరమ్ తేజ్, కేతిక శర్మ మధ్య వచ్చే రొమాంటిక్ మెలోడి జానవులే లిరికల్ వీడియో సాంగ్ ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తోంది. సాయి ధరమ్ తేజ్, టైమ్ లైన్, పవన్ కల్యాణ్ మధ్య సాగే ఘటనల నేపథ్యంలో బ్రో ఉండబోతున్నట్టు టీజర్‌తో చెప్పేశాడు సముద్రఖని. ఈ చిత్రంలో. రోహిణి, బ్రహ్మానందం, తనికెళ్లభరణి, సుబ్బరాజు, రాజా చెంబోలు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ

బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్, అలియా భట్ కలిసి నటించిన మూవీ 'రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ'. ఈ సినిమాను కరణ్ జోహార్ తెరకెక్కించారు. ధర్మేంద్ర, జయా బచ్చన్, షబానా అజ్మీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీను కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జులై 28 న ఈ సినిమా విడుదల కానుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com